సారంగధరచరిత్రము

కూచిమంచి తిమ్మన

అముద్రితాంధ్రగ్రంథసర్వస్వము, 7.

సారంగధరచరిత్రము

ఇయ్యది

కూచిమంచి తిమ్మకవివర్యునిచే

రచియింపఁబడి

శ్రీ చెలికాని లచ్చారావుగారిచే

సంపాదింపఁబడినది.

చిత్రాడ
శ్రీరామవిలాసముద్రాక్షరశాల న్ముద్రితము,
1921.

చందాదారులకు రు. 0-8-0] [ఇతరులకు రు. 0-12-0.

పీఠిక

...

ఆ చేమకూర అప్పన్న గ్రంథము ననుసరించి వ్రాసితిననెను. ఈ యప్పన వేంకటకవికి మారుపేరో, లేక యతఁడు మఱియొక సారంగధరచరిత్రము వ్రాసెనో పరిశీలింపవలసి యున్నది.

(3) రెండవ ద్విపద పరశురామకృతము కావలెను. గ్రంథము సరిగా లేదు. ద్విపదకావ్యకర్తల కాలము సరిగ దెలియదు. మూఁడవ రెండవ ద్విపద లొకటియా రెండా విచార్యము.

ఈతిమ్మకవి ఆరువేలనియోగిబ్రాహ్మణుఁడు. కౌండిన్యగోత్రుఁడు. బయ్యనామాత్యుని ప్రపౌత్రుఁడు అమ్మయ్య పౌత్రుఁడు, గంగమంత్రి పుత్రుఁడు. తల్లి లక్ష్మమ్మ. సింగన్న, జగ్గన్న, సూరన్నాదు లీతని సహోదరులు. ఈతఁడు గోదావరీమండలములో పీఠికాపురసంస్థానమునం దుండు కందరాడగ్రామ కరణము. ఈతనికాలములో నాంగ్లేయులకును పరాసులకును తఱుచు యుద్ధములు జరుగుచుండుటయు, నాగ్రామసమీపముననుండియే సేనలు తఱుచు రాకపోకలు జరుగుచుండుటచేతను, వారలకు మార్గసౌకర్యాదులు చేయుటయు నాసేనలు దాడులకు వెఱచియు యీతఁ డాగ్రామము వదలి చంద్రంపాలెము వాసస్థలముగా నేర్పఱచుకొని యున్నట్లు నిప్పటికిని చంద్రంపాలెములో నున్న నాతనివంశజులు చెప్పుచున్నారు. ము న్నీకవి యున్న కందరాడవద్ద నివేశనస్థలము పాడుదిబ్బగా చూపఁబడుచున్నది. ఈ గ్రామము పెద్దాపుర పీఠికాపుర మార్గమున ఫకీర్దీనుపాలెమువద్ద చూడఁగును. "ఈయన గ్రంథంబులు చేయనారంభించిన కాలమునందు పీఠికాపురసంస్థానమున రావు మాధవరాయనృపతి ప్రభువుగా నుండెను." అని రావుబహద్దరు కం. వీ. పంతులుగారు వ్రాసియుండిరి. ఈయనయభిప్రాయప్రకార మన్నదమ్ములైన మాధవరావు, నీలాద్రి రావులలో శ్రీమాధవరావుని ప్రభువుగాఁ దలంచియుండిరి. ఇందులకు రుక్మిణీపరిణయ, రసికజనమనోభిరామాదులనుండి యుదాహరణములు చూపిరి. ఈయన వారి నప్పటిప్రభువులుగా భ్రమపడి చూసియుండిరి. ఈయనకాలమునాఁటి పెదమాధవరావు మాత్రమే పట్టపుప్రభువై యుండెను. ఈయన చూపిన చినమాధవరావుమాత్రము ప్రభువు కాడు. కవి యించుమించుగా డెబ్బదిసంవత్సరములు జీవించియున్నట్లును 1757 సం లో మృతినొందినట్లును కం. వీ. గారు చెప్పుచున్నారు. అప్పటికి మాధవరావుగారును నీలాద్రిరావుగారును వీరుభయులును రాజులు కారు. ఈతనికి 'కవిసార్వభౌమ' బిరుదు నొసంగినయాతఁడు పెదమాధవరావుగారే యైయుండు. ఈతఁడే వక్కలంక వీరభద్రకవివద్ద వాసవదత్తాపరిణయంబుఁ గృతినొందెను. ఈకవులిరువురు సమకాలికులైనట్లును దెందులూరి లింగనారాధ్యుని శిష్యులైనట్లును చరిత్రాత్మకంబు.

మఱియు నీకవి కం. వీ. గారి కవులచరిత్రముప్రకారము 1687 నుండి 1757 సం. వరకు నున్నట్లు సూచింపఁబడినది. ఈకాలములో రాజ్యపాలనకు వచ్చినవారు పెదమాధవరావు, నరిసింగరావు, వేంకట్రావు, జనార్దనరావు, వెంకటకృష్ణారావు గారు యుండినట్టు లీకవియనంతరము చిన్నమాధవరావు పాలకులైయుండినట్లు పీఠికాపురసంస్థానచరిత్ర చెప్పుచున్నది. మఱి పెద్దాపురసంస్థారచరిత్రయందు గూడ వీరు క్రీ. శ. 1759 వఱకు పరిపాలించినట్లును మహమ్మదీయులనుండి 1755 వరకు పరిపాలించునట్లును 1750 వఱకును వీరికి కొన్నిశాసనములు పుట్టినట్లును చెప్పఁబడుచున్నది. కనుక నీలాద్రి మాధవరావులు ప్రభువులుగాఁ గవి చెప్పినప్పటికిని కవి పట్టప్రభువులని యుద్దేశము కాదు. కవియే సారంగధరచరిత్రమునందు నీలాద్రి మాధవరాయలఁ బేర్కొనక "రావు వేంకటకృష్ణరాయవిశ్వంభరారావల...." యని పేరుకొనియున్నాడు. కం. వీ. గారు యీసారంగధరచరిత్రను జూడలేదని వ్రాసికొని యున్నారు. పిఠాపురసంస్థానచరిత్రను చూడనందున నట్లు వ్రాసియుందురు. అప్పుడు సాధారణముగా పెద్దకుమారుఁడు ప్రభువై రాజ్య మేలుచున్నప్పటికి నాయన సోదరులు కూడ రాజులుగానే పరిగణింపఁబడుచుండిరి. ఇట్లే బొబ్బిలిసంస్థానంబున ప్రభువుగాని శ్రీరాజా జనార్ధన రంగారాయణింగారు తమరు ప్రభువుగా మిత్రవిందాపరిణయమున వ్రాసికొనినారు. బొబ్బిలిసంస్థానచరిత్రమునం దీయన ప్రభువుగాఁ గానఁబడమిం జేసి

సంశయనివారణార్థమై బొబ్బిలి మహారాజావారికి యుత్తరం బొండు వ్రాసియుంటి. అందుపై శ్రీ మహారాజావారు "ప్రభువుల యన్నదమ్ములందఱు పూర్వకాలమున ప్రభువులుగానే గౌరవింపఁబడుచుండిరి." అని (26-11-1920) జవాబు వ్రాయించిరి గాన కవి నీలాద్రి మాధవరావులు పట్టరాజులు కానప్పటికి నాచారములను బట్టి ప్రభువులుగా లిఖించియుండు. ఈకవికాలములోనే 5 గురు ప్రభువులు పరిపాలకు లైరి. ఈప్రభువులు 80 సంవత్సరములలోనే సరిపాలించి రాజ్యపాలనంబు లొనర్చి కీర్తిశేషులైరి.

వీర లింత యచిరకాలంబులోనే మరణించుట ప్రజలు దురదృష్టవంతులు. అచ్చతెలుఁగున నిరోష్ఠ్యనియమమునకు దారి తీసినవారిలో నీకవియే ప్రథముఁడు. లక్షణసారసంగ్రహమునఁ బూర్వలక్షణగ్రంథంబులో లేని నూతనవిషయంబును జేర్చి వ్రాసి యున్నాడు. ఈసారంగధరచరిత్రమును శంకరునకు కృతియిచ్చెను. ఇందుఁ జిత్రాంగిని వేశ్యగా వ్యక్తీకరించియున్నాఁడు. ఈగ్రంథమందలి కథ శృంగారాదుల యనుప్రవేశము గలిగి కరుణారసప్రధానమై రమ్యతరమై హృదయాకర్షితంబై యొప్పుచున్నది. ఈతనికవిత్వము మిగుల రసవంతం బనుటకు సుప్రసిద్ధుండగు ఏనుగు లక్ష్మణకవి

"హాటకగర్భవధూలీ
లాటనచలితాంఘ్రినూపురారాన శ్రీ
పాటచ్చదములు తేనియ
తేటలు మా కూచిమంచి తిమ్మయమాటల్."

అని శ్లాఘించినట్లును, ప్రసిద్ధంబు. మఱియు జాహ్నవీమాహాత్మ్యంబునందు

గీ. "వర్తమానకవీశ్వరవరునిఁ గూచి, మంచి తిమ్మకవీంద్రుని మదిఁ దలంతు."

అని గౌరవంబుగఁ బేర్కొనియుండె. "బహుళగ్రంథములను రచియించినవాఁడు ఇన్నిగ్రంథములను సలక్షణమైన మృదుమధురపాకమున రచియించిన కవి యాధునికులలో మఱియెవ్వడును లేడు." అని రా. కం. వీ. గారు వ్రాసియుండిరి. స్త్రీవర్ణవాదుల రసవంతముగా వర్ణించిన రసికజనమనోభిరామమును రచియించిన కొంతకాలమునకు కవి రాజమార్గమునఁ బోవుచుండఁగా నాగ్రంథమును చదివి యందలి రసికత్వంబున కానందించిన వేశ్య యీతని మెచ్చి నలచి కౌఁగిలించికొనినట్లును, అంత నీతఁడు పెడమొగంబు వైచి విదలించుకొని పోవుచుండ, అందుపైన నామె 'నీ కట్లు చెల్లునా' యని

చ. "చతురులలోన నెంతయును జాణవటంచును నేను గౌగలిం
చితి నిటు మారు మోమిడఁగఁ జెల్లునె యో రసికాగ్రగణ్య"

అని యాశుకవిత్వమున నడుగగా, తిరుగ నాతఁడు

"యద్భుతమగునట్టి బంగరపుబొంగరపుంగవఁబోలు నీకుచ
ద్వితయము ఱొమ్ము నాటి యల వీపున దూలెనటంచుఁ జూచితిన్."

అని పద్యము పూరించి జనెనని కథ యొకటి వ్యాపించియున్నది. ఏది యెట్లున్నను వీనినిబట్టి యీతని కవిత్వము రసవంతంబనియు తెలుచున్నది. గ్రంథవిస్తరభీతిచే నీకవిచరిత్ర యింతటితో క్లుప్తంబుగా ముగించితి.

ఈసారంగధరచరిత్రమును రాయవరము కూచిమంచి చిట్టెన్నగారినుండి యొకప్రతియు, కడప చాగంటి సుబ్బారాయుడుగారినుండి యొకప్రతియు, తణుకుతాలూకా కావలిగ్రామమునుం డొకప్రతియు సంపాదించితిమి. చెదలు పట్టి పోయినపదంబులను పూరించక కుండలీకరణములలో నుంచి ముద్రించితిమి. కడప కరణంగారి మిద్దెపై పెండలపుదుంపలగంపలమధ్యలో వెదకగా చెదలు పట్టిన చివరాశ్వాసంబులతో గూడిన ప్రతి దొరికినది. ఏనుఁగు లక్ష్మణకవి వంశవృక్షంబును అచ్చటనే దొరికినది. ఈగ్రంథములను లోభులై మూలలను ముక్కపెట్టి పారవేసి పాపమున కొడిగట్టుకొను మూఢులవలెఁ గాక స్వార్థత్యాగబుద్ధితో మా కొసంగిన యీపైమహనీయులకు మాకృతజ్ఞతావందనము లర్పించుచున్నారము.

చిత్రాడ,
4-10-21.

ఇట్లు, సంపాదకుఁడు
చెలికాని లచ్చారావు

శ్రీరస్తు

సారంగధరచరిత్రము

ప్రథమాశ్వాసము

శ్రీకర గుణసార చిరశుభాకార, నాకధునీజార నవసుకుమార
శరనిధితూణీర చంద్రకోటీర, పరిచితామర వారభంజితమార
ద్విరదదైత్యవిదార దీనమందార, గిరితనూజాదార, కృత్తినిశార
ధృతకురంగకిశోర త్రిపురసంహార, తలిగరళాహార దండితక్రూర
మునిమనోబ్జవిహార ముదితకుబేర, ఘనభోగికేయూర కలితాస్థిహార
జగదననాధార సదమలాచార, నిగమాంతసంచార నిశితకుఠార
భువనైకశృంగార పుణ్యవిచార, వివిధసంగరశూర వృజినాపహార
మృదుతరన్యాహార మృత్యువిదూర, విదితకృపాపూర విశ్వవికార
వినిభృతాఖిలభార విలసత్ప్రకార, వినయవిద్యాంకూర వీరావతార
హీరతారపటీర హిమఘనసార, శారదాంబుదహార చారుశరీర
చిరయశోలంకార సింధుగభీర, గుర్తురుతరోదార కుక్కుటలింగధీర
యని యిష్టదేవతాప్రార్థనఁ జేసి, ఘనులఁ బురాతనకవుల భజించి
వనరుహాసనురాణి వాణినిఁ గొలిచి, తనర నేనికమోముదైవంబు నెంచి
యలఘుతేజోనిధి యగు దెందులూరి, కులు లింగనారాధ్యగురుని నుతించి
తలఁపున సారంగధరచరిత్రంబు, తెలుఁగున ద్విపదగాఁ దివిరి యొనర్ప
బూని యే నిక్కావ్యమున కెవ్వఁ డధిపుఁ, డౌనొకో యని మది నరయుచున్నంత
శ్రీనగజాసమంచితకుచాలిప్త, మానితసారంగ మదఘనసార
సాంకవాగరుగంధసారకాశ్మీర, పంకసంకలితశుంభద్భుజాంతరుఁడు
దినకరశతకోటిదేదీప్యమాన, ఘనఫణామణిమయూఖభ్రాజమాన
పవమానభుక్కులపరివృఢోద్గాఢ, వివిధవిభూషణావృతలసన్మూర్తి
యశ్రాంతముకుటీకృతామృతాంశుప్ర, భాశ్రేణికాప్రతిపదసముల్లసిత
పటుజటాజూటాగ్రభాగసభాగ్దివ్య, తటినీబలాంతరోత్పలకైరవుఁడు
కుందచందనహార గోక్షీర హీర, మందారసురసరిన్మల్లీతుషార
కాకోదరాధీశకాశకైలాస, రాకేందునీకాశరమ్యవిగ్రహుఁడు
డమరుత్రిశూలఖడ్గకపాలపరశు, కమలఖట్వాంగగంగత్కరాంబుజుఁడు
పాకజిన్మణివిభాభాసురాభీల, కాకోలరుగ్జాలకలితకంధరుఁడు
దుర్మదవేదండదోషాచరేంద్ర, చర్మకౌశేయకాంచత్కటీరుండు
ప్రసవబాణాసన స్రవిమలగాత్ర, భసితాంగరాగవిభావిభాసితుఁడు
సదమలదరహాసచంద్రికోల్లసిత, వదనామృతాంశుబింబప్రభాన్వితుఁడు
సముదగ్రకైలాసశైలోపమాన, రమణీయభద్రాక్షరాజవాహనుఁడు
నందీశగుహగజాననముఖప్రమథ, బృందబృందారకబృందసేవితుఁడు
భక్తరక్షణకళాపారాయణుండు, భుక్తిముక్తిప్రదాద్భుతచరిత్రుండు
వరదుఁడు రజతసర్వతనికేతనుఁడు, కరుణాపయోధి శంకరుఁ డొకనాఁడు
గురుతరకౌండిన్యగోత్రపావనుని, వరకూచిమంచిసద్వంశసంభవుని
గంగనమంత్రిశేఖరునకు నుత్త, మాంగన యగు లచ్చమాంబకు సుతుని
శివపదాంభోజాతసేవానిరూఢ, కవితామహారాజ్యఘనధురంధరుని
సకలలక్షణలక్ష్యసాహిత్యవిదుని, నకలంకగానవిద్యావిశారదుని
రావు వేంకటకృష్ణరాయ విశ్వంభ, రావరపరిగుప్తరాజమహేంద్ర

వరదేశభాగభాస్వద్దివ్యపిఠ, పురమహారాజ్యవిభూషాయమాన
పావనకంద్రాడపట్టణాధిపుని, శైవకళారహస్యజ్ఞానవిధిని
ఘనులు మెచ్చఁగ ననేకప్రబంధంబు, లొనరించి విఖ్యాతి నొందిన ఘనుని
తిమ్మసత్కవినామధేయుని నన్ను, నెమ్మది గృపఁ జూచి నీ వొనరింపఁ
దలఁచిన సారంగధరచరిత్రంబు, వలనుగాఁ గృతి సేయవలయు మా కనుచుఁ
గలలోన బొడకట్టి కడలేనిప్రేమ, గులుక నానతి యొసంగుటయు నయ్యఖిల
భువనైకనాయకుఁ బొదలెడు వేడ్క, నవిరళగతిఁ గృతి కధిపతిఁ జేసి
నవ్యవైఖరి, నే నొనర్చు నీభవ్య, కావ్యంబునకుఁ గథాక్రమ మెట్టిదనిన
అవనిపై భోగమోక్షాకరం బగుచు, దివజేంద్రునగరి నెంతే నగఁజాలి
కొత్తడంబులడంబు కోటలలంబు, కత్తలానులకోపు గజములయేపు
కేతనంబులసంచు గీములమించు, నాతిమిన్నలసొరు నగరులతీరు
పసిఁడిమేడలచెల్వు పరిఘ లనల్వు, కుసుమకోటులసొంపు కొలఁకులపెంపు
చప్పరంబులవిప్పు జిగిలేలయొప్పు, కప్పురంబులతావి గాణాలఠీవి
యాపణంబులపేర్మి యనుఁగులకూర్మి, గోపురంబులయంగు గోడలరంగు
పుడమివేల్పులపెల్లు బోజగులత్రుళ్లు, పడకటిళ్లహొరంగు పనులమెఱుంగు
రాచమొత్తముటెక్కు రాణువయుక్కు, గోచయంబులదిండు కోమట్లమెండు
రంగవల్లులగిచ్చు రసికులహెచ్చు, రంగస్థలులపట్టు రచ్చలమట్టు
మణికదంబముకల్మి మాన్యులబల్మి, గణికలపోడి లెంకలనెరవాడి
వనములసొంపు దేవళములదుంపు, పెనువజీరులనేటు ప్రెగడలనీటు
కాపుగేస్తులబోజు గడితలతేజు, ధూపవాసనమేలు తొడవులవీలు
గలిగి లోకాతీతగరిమఁ జెన్నొంది, తిలకింప గౌతమీతీరదేశమున
సేతుకాశీముఖక్షేత్రంబులట్ల, భూతలఖ్యాతిచేఁ బొదలుచుఁ గోటి
లింగతీర్థస్నానలీలలఁ బొంపె, సంగి మార్కండేయశంభుపదాబ్జ
పూజావిధప్రాప్తి పొసఁగ నెసంగు, రాజుమహేంద్రవరం బనువీడు.

ఆవీడు పాలించు నన‌యంబు వేల్పు, టావీ డితనికంచు నర్థులు వొగడ
రూపనిర్జితపుష్పరోపుఁ డశేష, భూపసభాఖ్యాతపుణ్యకీర్తనుఁడు
రాజశేఖరపాదరాజీవయుగళ, పూజావిధాలబ్ధభూరివైభవుఁడు
నిరతమహోద్దండనిజభుజదండ, పరిచితకోదండపరిముక్తచండ
కాండవినిర్జితోత్కటపరిపంథి, మండలేశ్వరచమూమండలోన్మదుఁడు
ధైర్యపరాభూతతపనీయశిఖరి, శౌర్యగంభీరతాచాతుర్యశాలి
మాననీయుడు సదామధురభాషణుఁడు, దినదరిద్రతాతిమిరభాస్కరుఁడు
వివిధసంగరకళావిదుఁడు సమస్త, కవిజనచాతకోత్కరఘనాఘనము
నలహరిశ్చంద్రాదినానానరేంద్ర, తులితమహాదానదోర్బలాన్వితుఁడు
సకలవసుంధరాజననవోద్యాన, నికరవసంతుఁ డున్నిద్రతేజుండు
దరశరశరదభ్రతారాసితాభ్ర, హరహారహారనీహారాభయశుఁడు
వరపాండవాన్వయవర్ధనుం డమల, తరమూర్తి విష్ణువర్ధనసమాహ్వాయుఁడు
రాజరాజనిలింపరాజవైభవుఁడు, రాజరాజనరేంద్రరాజన్యవరుఁడు
అతనిపట్టపురాణి యలికులవేణి, పతిహితశుభవాణి పరమకల్యాణి
వితరణగుణమహావిద్యామతల్లి, సతతయాచకబంధుజనకల్పవల్లి
పాలితాఖిలభూసుపర్వకుటుంబ, శైలజాచరణాంబుజద్వయాలంబ
సదమలకారుణ్యసహితాంతరంగ, విదితయశోజగద్వినుతప్రసంగ
పావనతాగంగభాగ్యపౌలోమి, కేవలసౌభాగ్యగిరివరపుత్త్రి
వరరూపరతి సాగవాక్యనాగ్రమణి, నిరుపమసామ్రాజ్యనీరధితనయ
వితతక్షమాగుణవిపులావధూటి, యతిసాధ్వి రత్నాంగి యలరొందుచుండు
వారితనయుఁ డనివారితనయుఁడు, సారసహితవిభాసారసహితుఁడు
ప్రత్యర్థి దానశుంభద్రవిణుండు, ప్రత్యర్థిదానశుంభద్రవిణుఁడు
గానలోలుఁడు దయాకలితమానసుఁడు, మానవతీనవమకరకేతనుఁడు

కదనభీకరుఁడు శృంగారవారాసి, విదితచతుష్షష్టివిద్యావిదుండు
ధారుణీతలధురంధరతాభిగుప్త, సారంగధరుఁడు రాజత్కాంతివిజిత
సారంగధరుఁడు పూజానిధీల్లసిత, సారంగధరుఁ డైన సారంగధరుఁడు.

జనకుండు వేటకుఁ జనియున్నవేళ, దనతోడి రాజనందనులును దాను
పారువంబులఁబట్టి పందెంబు వైచి, తారాపథమునకు దమి నెగ నిడువ
రాజసూనుని పావురము వాని నెల్ల, రాజసంబున మీరి రయము దీపింప
ఱెక్క లల్లార్చి తూరికడంక మెఱయ, దక్కక రిక్కలదారికి నెగసి
పేరెముల్ వారుచుఁ బెక్కుచందములఁ, గేరుచు సుడిగొని కేళ్లు దాటుచును
చూడఁజూడఁగఁ దద్ద సూక్ష్మరూపమున, నోడక గాడ్పున కుద్దియై పఱచి
అమరాపగాసైకతాగ్రభాగములఁ, గొమరారు రాయంచకొదమ యనంగ
గగనకేశుని శిరోగ్రం బెక్కజాగు, తొగలసంగడికాని తునియ యనంగ
ననిమిషద్విరదంబు హస్తంబులోనఁ, బొనరారు వెలిదమ్మిపూమొగ్గ యనఁగఁ
దనకులస్వామియై దనరెడునరుణుఁ, గొనబారుతమిఁ గనుంగొన బారుకరణి
మినుకుమిన్కు మటంచు మిగుల దవ్వేగి, కనఁబడరాకున్న గలఁగి యందఱును
తల లెత్తి జూచుచుఁ దత్తరింపుచును, గిలకిల కనవ్వుచుఁ గేక లీడుచును
చప్పట్లు జఱచుచు సద్దు సేయుచును, రెప్పలు వేయక రేసి చూచుచును
కలరవంబదె పోయెఁగదయంచు వేడు, కలరవం బొసంగు సంగడికాండ్రఁ జూచి
చిరునవ్వు మోమునఁ జిగురొత్త దాని, మఱలింతునని రాకొమరుఁడు వైళంబ
పెంటెపిట్టను దెచ్చి పెడగరుల్ పట్టి, వింటి కెత్తుచుఁ గేక వేసి పిల్చుటయు
బిరబిర నజ్జగబిరుదుపావురము, మఱలివచ్చుచునుండె మఱి యంతలోన
ధాత్రీశ్వరుని భోగతరుణియై దనరు, చిత్రాంగి మేలిపసిండిసోయగపు
మేడపైఁ గ్రీడల మెలఁగుచునుండి, యీడుమీఱిన యాఖగేంద్రోత్తమంబుఁ
గనుఁగొని ముద్దుజిల్కను గొని చేత, నునిచి దానికి జూపి యొయ్యనఁ బిలచె
పిలిచిన నది తన పెంటిగాఁ దలఁచి, చెలగి పార్శ్వము వచ్చి చిలుకపై వ్రాలె
వ్రాలిన మెల్లన వాల్గంటి దానిఁ, గేల గీలించి కోర్కెలు వెల్లివిరియ
మేడ దిగ్గున డిగ్గి మీఱి యిడరాని, వేడుక నుడిగెంపువెలఁదులుఁ దాను
కడువంతహొయల జొక్కటమై వెలుంగు, పడకటింటికి దొట్రుపడక యేతెంచి
పార్శ్వంబు నొకచోట పదిలంబు చేసి, పర్వెడుకోరికల్ పండపో మిగులఁ
జక్కనివాఁడైన సారంగధరుఁడు, చిక్కెఁబో నేడు నాచేతనటంచు
వెక్కుచుఁ జొక్కుచు విఱ్ఱవీగుచును మిక్కిలి తమకంబు మేకొనఁ గ్రొత్త
సింగారమూని కెంజివురువిల్కాని, బంగరుబొమ్మనా భాసిలుచుండె.

అంత రాకొమరుఁ డట్లాపుల్గు జనుట, కెంతయు వగచి చేయంది నెమ్మొగము
వెలవెలఁబార నివ్వెఱపడి దిశలు, గలయ వీక్షింపుచుఁ గళరవ మొదవ
మొనసి నాబంగరుముద్దుపావురము, నెనలేనికడఁక నేడేల చేవదలి
యనిచితి ననిచిన నది యేల దవ్వు, చనెఁ జనుఁగా కేమి సయ్యాన మఱలి
చేతికి రాక యాచిత్రాంగిమేడ, కాతతగతి నేటి కట తేలిపోయె
పోయిన మఱల గొబ్బున దాని దెచ్చి, యీయెద మాన్పువా రెవ్వరు గలరు
ప్రేమఁ బెంచిన వేటుపిట్ట బోవుటకు, నేమి సేయుదు కర్జ మెయ్యది యింక
చెల్లంబొ కటకటా శివుఁ డిపుడిట్టి, తల్లడంబేల డెందమునకుఁ గూర్చి
నయ మెన్న రాచలోనగరున కొరుల, భయమూన కేరీతి బనుపఁ బొసంగు
కావున నేనె యక్కలికిఁ బ్రార్థించి, వేవేగఁ గొనితెత్తు విహగోత్తమంబు
నని చననుంకించు సదను సుమంతుఁ, డను మంత్రినందనుం డైనసుబుద్ధి
యారాచపట్టికి నడ్డంబు దూరి, కూరిమి మెరయఁ గన్గొని యిట్టు లనియె.

కటకట నృపపుత్ర కర్జం బెఱుంగ, కిటువలెఁ బోవ నూహించుట దగనె
మిగులమన్ననఁ జేసి మీరు పెంచుటకు, తగిలి మేల్పనిఁ గూర్ప ధర్మంబు మాకు
రా జూర లేనిచో రాచనగళ్ల, నోజమాలి చరింప నుచితంబె నీకు

దొరసానులెడకుఁ బోదురె యువజనులు, నరనాథపట్టి మున్నెరికలు మాను
చక్కదనంబున జాణతనంబు, నెక్కువతీవియు నెలజవ్వనంబు
కలిగిన జగవన్నెకాడవు నీవు, దలఁప నమ్ముద్దుకెందలిరుఁబోడియును
చక్కఁదనంబును జాణతనంబు, నెక్కువ తీవియు నెలజవ్వనంబుఁ
కలిగిన దొంటిమై గనుఁగొన్నవేళ, తలంపు లెట్లుండునో తర్కింపఁబోల
దేకాంతవేళల నేకాంత యైన, భూకాంత చక్కనిపురుషుఁ డబ్బినను
పడరాని వెతలచే పైఁబడుఁగాక, విడువనేర్చునె వట్టివేఱిఁడి యగుచు
విరిబోండ్లడెందముల్ వివరించి తెలియ, హరిహరాదులకు శక్యము గాదు సుమ్ము,
ధనము జూచిన వధూధనము గన్గొన్న, మనసువారదె యెట్టిమౌనుల కైన
నలపరాశరకౌశికాదులు చెలుల, వలలఁ జిక్కఁగ నెంతవారలు నరులు
వలపు దబ్బర వావివరసులు సున్న, దలఁపు నమ్మికె యిల్ల తాల్మి హుళక్కి
కోప మెక్కువ దయాగుణము కొఱంత, చాపల్య మధికంబు సత్యంబుతీలు
పలుమరు తలముట్టి బాసఁ జేసినను, తలిరుఁబోడుల నమ్ముఁదగదు కుమార
జోటుల బెళకువాల్ చురుకుజూపులకు, బోటికూటువలయబ్బురపురూపులకు
సుదతుల జిలిబిలి సొలపుఁబాటలకు, ముదితల ముంపెంపుముద్దుమాటలకు
ననబోండ్ల చిన్నారినగవు జిన్నెలకు, వనితల క్రొత్తజవ్వనపువన్నెలకు
నింతుల గుబ్బపాలిండ్లసొరులకు, దంతిగామినులు నిద్దంపుటారులకు
మెలతల గడితంపు మెఱుఁగుఁగొప్పులకు, నెలదుల నాడెంపు మింతయొప్పులకు
రమణీమణుల నిగారంపుజెక్కులకు, కమలలోచనల యక్కజపుటెక్కులకు
పడఁతుల మోముదామరల తేటలకు, పడఁతిమిన్నల వేడబంపుటాటలకు
వలవకుండుదురె దేవతలై నహహ, కలిగి పైఁబడి తద్ద గరగించు నిన్ను
గాకున్న నెన్నైన కల్లలు గూర్చి, కాకుజేయును రాజుగారితోఁ జెప్పి
యెఱిఁగియెఱుంగ కి ట్లెన్నఁడు లేని, కరటితనం బేల కాంచెదవయ్య
నీవు నెమ్మెనితో నిలిచితివేని, పావురాయలు లక్ష పదివేలు గలవు
తలయున్న మణిమయోద్యత్కిరీటములు, గల వెన్నియైన నిక్కం బట్టులగుటఁ
బోవవల్వదటంచు బొదవినఁ గినిసి, భూవరసుతుఁ డాసుబుద్ధి కి ట్లనియె.

అవునవు మేలుమే లహహ నీబుద్ధి, వివరించి చూచిన వింతలై తోచె
నరమరలేక నెయ్యమున మాతోడఁ, బెరుఁగుచుండుటఁ జేసి భీతి వోవిడిచి
వీనుల కీటెలై వినసింపుగాని, కానిమాటలు బల్కఁగాఁ జాగితిపుడు
నీతిమార్గములెల్ల నేర్తునటంచుఁ, జాతకంబులు బల్కఁ బాడియే నీకు
కొంక కెందును దల్లికొడుకుల సందు, ఱంకలు గట్టు బల్ రాగలు గలరె
యరయ మాతల్లి రత్నాంగి యొక్కతెయు, నురుపుణ్య చిత్రాంగి యొకతెయె తెలియ
పారుఁడ వగుట నాపక నెరపేది, తూరియాడెద విట్లు దోసంబు గాదె
పరమపతివ్రతాభరణ మత్తరుణి, పరుని నెవ్విధమునఁ బైకొనఁగోరు
కోరెఁబో ననుఁ దనకొడుకని చూడ, కేరీతిఁ గవయుట కిచ్చలోఁ దలఁచు
తలఁచినఁ బరవనితాసహోదరత, నెనయు నే నప్పని కెటు లియ్యకొందు
కొనకున్న సతి వట్టికొండెంబు లేల, జనవల్లభునకు కొంచక చెప్పఁజూచు
చూచిన నమ్మహీశుఁడు కల్ల నిజము, లేచందమున నిర్ణయింపక నుండు
నుండిన మది దనయుండని యనక, దుండగంబూని యేత్రోవ దండించు
దండించుగాకేమి దైవయోగం బె, టుండిన దొలఁగఁజేయుట కేరితరము
తరము గా దింకని దబ్బరల్ మాను, మరుదంద నిటదెత్తు నవ్విహంగంబు
ప్రాణపదం బైన పసిఁడిపార్వంబు, నే నేమిటికిఁ దేక నిపు డూరకుందు
నని మానకేతెంచు నక్కుమారకునిఁ, గని మంత్రిసూనుఁడు క్రమ్మఱఁ బలికె
వినుము కుమార నావిన్నపం బిపుడు, నెనరువో నాడక నీకు హితంబె
చెప్పెదఁగాని వంచించుట గాదు, తప్పదు నామాట తథ్యంబు సుమ్ము,
నలువ లోకములోని నలువెల్లఁ గూర్చి, చెలువార నమ్ముద్దుచెలువ నొనర్చె.

దానిజగారంగు దానిహొరంగు, దానికన్నులతీరు దానికౌను సొరు
దానిక్రొమ్ముడివిప్పు దానిమెయియొప్పు, దానిగుబ్బలహెచ్చు దానిమేల్గచ్చు
దానిచెక్కులటెక్కు దానిబల్వీక్కు, దానిమోముమెఱుంగు దానితెరంగు
నర సుర గరుడ కిన్నర యక్ష భుజగ, హరిమధ్యలకు నైన నబ్బదుసుమ్ము
కడలేని యొరపు నిల్కడఁ గన్న మెరపు, పడఁతులమిన్న యబ్బరపుపూఁబొన్న
పసిఁడిసలాక కప్రపుటంటిమోక, కుసుమబాణుకటారి కులుకుమిటారి
మొలకవెన్నెలతేట ముద్దులమూట, కులుకువజ్రపుబొమ్మ కలువపూరెమ్మ
వలపులదీవి గోవజవాదిక్రోవి, బలుముత్తియపుగోవ పగడఁపుదీవ
చిత్తజువిరిముల్కి చిలుకలకొల్కి, క్రొత్తకస్తురిలప్ప గొనఁబులకుప్ప
వలుదగొజ్జఁగిబంతి వన్నెలదొంతి, తళుకుటద్దపుడాలు తలఁగనిమేలు
నెరతనంబులప్రోవు నీటులతావు, కొరలుతేనియబావి గుజ్జులేమావి
యాయన్నుమిన్నసోయగముఁ గన్గొన్న, మాయురె సురలైన మరులుగొం డ్రెన్న
కలికి వేనలి కెనగాక మొగిళ్లు, వెలవెలబారుచు విడిమలల్ వట్టె
ముద్దియనిద్దంపు ముద్దునెమ్మొగము, నుద్దివోలక మచ్చయూనె జాబిల్లి
ననబోడి బొమలయందముఁ గనలేక, తునియలై మరువిల్లు ధూళినడంగె
కలికి బేడిస లింతికన్నులు జూచి, కలగి రెప్పలు మోడ్పఁ గానక యుండె
నాళీకదళనేత్ర నాసకునోడి, వీలి సంపఁగిమొగ్గ విప్వదొడంగె
తొవకంటి చెక్కులతోఁ దీటుగామి, రవళినద్దముల రారాపులఁ బడియె
పడఁతి వీనులచెల్వు పడయంగరామి, నుడుగ కెంతయు వ్రేగుచుండె శష్కులులు
తెఱవ మెఱుంగువాతెఱ జోకగాక, తరిదప్పి చివురు లెంతయు గారుపారె
ముగుద క్రొంజిగిదంతములకుఁ గ్రిందగుట, మగఱాలు త్రాసంబు మానక పూనె
నుడురాజముఖియర్తి కుద్దిగాలేక, సుడివడి మొరసేయఁజొచ్చె చిందంబు
లతివబాహువులకు నఱచేతులకును, బ్రతిగాక మడుపులంబడె బిసాంబుజము
లెలనాగ గుబ్బపాలిండ్లకు నోడి, పలువన్నియలఁ గ్రాగె బంగరుగిండ్లు
మదవతినూగారు మాదిరిగాక, పొదలుతుమ్మెదచాలు పొదలలో నిరికె
జలజాక్షివళులతో సవతువోలమిని, పలుమరు తరఁగలు భంగంబు నొందె
చానపొక్కిలితోడ సాదృశ్యమూనఁ, గానక మడుపులు గలఁగుచునుండె
లలననెన్నడుముఁ బోలఁగలేక సింగ, ములు గుహల్ దూరి యెప్పుడు బొబ్బరించు
పొలఁతపిరుందుల పురుడుగాలేక, యిల మెత్తబాటూనె యిసుకతిన్నియలు
కరియాన తొడలపొంకముఁ గాంచనోడి, కరటితుండములు వక్రతయూని మెఱఁగు
కలమగర్భములు వాల్గంటిపిక్కిలకు, తులగాక తృణమూనెఁ దుది వెన్నుఁ జూపె
పూఁబోడి మీఁగాళ్లఁ బోలక నీట, తాబేళ్లు దాగెనౌ దలఁజూపనోడి
యలివేణియడుగుల కనిశంబు నోడి, నలజలజాతబ్బందము బైలబడియె.

తోయజాననచెల్వు దూకొని పొగడ, వేయినోళ్ల భుజంగవిభునకుఁ జనదు
చిత్రాంగి యనుమాట సిద్ధంబు గాఁగ, ధాత్రి నమ్ముద్దుపైదలి వెలుఁగొందు
తరుణులఁ గన్గొన్నతరిని రాయైన, కరఁగునటండ్రు లోకములోని జనులు
నరనాథ వెన్నకన్నను మెత్తనైన, పురుషుల డెంద మప్పుడె జాలుఁగొనదె
కావున నయ్యింతిఁ గనుఁగొన్నయపుడె, భావజుఁ డరియురి బాధింపఁజాగు
వేయి నేటికి వట్టినెట్టులు మాని, రాయడ యింటికి రమ్ము రమ్మనిన
మనుజేంద్రతనయుఁ డమ్మాట యించుకయు, వినఁబోక తనపాలివిధిగట్టి త్రోఁచు
కొనిపోవ నరిగె తళ్కుపిసాళివాలు, కొనఁజూపు లెననిదిక్కుల దెక్కు చూప
తీరుగా కొనగోర దిద్దిన నొసలి, తోరంపు నిడుదకస్తురిరేక యొప్ప
బంగరుతగటుదుప్పటి వలెవాటు, రంగుల నల్గడ రాణబొసంగ
నిరవొప్పఁ బసిఁడితాయెతులు గొజ్జంగి, విరిసరంబులు జుట్టి వ్రేసిన యోర
సిగమీఁద జరతారు చెంగులమేలి, జగరంగుగల బురుసారుమాల్ మెఱయ
తెలిహురుమంజి ముత్తియపుచౌకటుల, తళతళల్ చెక్కుటద్దములకు బొదల
కలికరాచిలుకటెక్కుల లెక్కఁ గొనక, యలరు బచ్చలతాళి యరుత వెలుంగ

నవరత్నమయకంకణము లుంగరములు, వివిధభూషణములు వేనవేల్ వరల
దండిగా వజ్రాలు దాపిన మేటి, గండపెండెరము డా కాలఁ జెలంగ
పట్టుగా కటిమీఁదఁ బైచెంగు లునిచి, కట్టిన జరబాబుకాసె భాసిల్ల
గోవజవాదియు గొజ్జంగనీరు, పూవుటత్తరుబింకపొక్కిలి మంచి
గందంబు కపురంబు గలపిన కలప, మందంబు మేనఁ బాయక తావులీన
చెలువార మెలచక్కి జెరివినమంచి, బలుదమ్మి కెంపులబాకు శోభిల్ల
పుడమికి డిగ్గి యబ్బురపువేడబము, లడరఁ గ్రీడించు జయంతుఁడో గాక
కంతుఁడో యామినీకాంతుఁడో నవవ, సంతుఁడో యని జనుల్ సారెకు నెన్న
చిత్రాంగి మొగసాలఁ జేరి యచ్చోటి, వేత్రహస్తుల మీఱి వెసతోను దూరి
పగడంపుగుండ్రగంబములు నీలంపు, జగిలెలు ముత్యాలజాలీలు చంద
మామరాగోడలు మగరాలమెట్లు, తామరకెంపు బల్ తలుపులు పులుగు
రామానికంపుతోరణము వెడంద, గోమేధికంబుల కొమరులు జార్లు
పిల్లికన్వన్ని రాబెడిదంపుటోడు, బిళ్లలు పటికెంపుబెండెలు పుష్య
రాగంపు వెనుచదరములు వాసములు, బాగైన యపరంజి పసిఁడిదూలములు
గలిగి శృంగారవైఖరులఁ జెన్నారు, కొలువుకూటంబులు గుత్తంపుమిద్ది
యలు మల్లెసాలలు నాటిగీములును, చలువపెంజవికెలు చంద్రశాలికలు
మొదలగు నిమ్ము లిమ్ముగఁ గనుఁగొనుచు, గొదుగక బంకుబంకులు దాటి చనుచు
గొజ్జంగిపూనీటికొలఁకులపజ్జ, గుజ్జులేమావిమ్రాకులఁ బెనఁగొన్న
పరువంపు వలిదాకపందిరిచాల్పు, సరసఁగ్రాల్ నునుగున్నసంపెగల్ దరసి
ప్రోది కప్రపుటంటిబోదెలచెంతఁ, బాదొప్పు చంగల్వబావులు గడచి
వలపులు గుల్కు చెల్వపువట్టివేళ్ల, చలువచప్పరములచాయల నిల్చి
తావుల్ గుబాళించు దట్టంపుమల్లె, పూవుఁబందిరుల దాపున విశ్రమించి
కలువరారాదోనిగముల జాల్వారు, చలువక్రొవ్విరిదేనెజక్కరల్ దాటి
పొన్నలు పొగడలు పోకబోదియలు, సన్నజాజులు పనసలు దాసనములు
నిమ్మలు దబ్బలు నేరేళ్లనంట్లు, కమ్మరేగులు నారికడము లిప్పలును
మాదిఫలంబులు నూరేడు లీడ, లాదియౌ కేళీవిహారభూరుహము
లందంద దాటి చిత్రాంగి లోనగరి, కందంబుగా నేగి యట నిల్చుటయును.

అప్పుడు చిత్రాంగి యబ్బురం బొదువ, గుప్పున లేచి యెక్కువ తత్తరమున
బిత్తరించుపిసాళిబెళుకువాల్జూపు, మొత్తముల్ తొగల నిమ్ముగఁ గ్రుమ్మరింప
వెన్నంటు గీల్గంటు వ్రేగున దద్ద, సన్నంపులేఁగౌను జవజవలాడ
కట్టణిముత్యాలకమ్మలడాలు, ధట్టించి చెక్కుటద్దములఁ జిందాడ
మేపూతకలపంపు మేలినెత్తావు, లేపొంది దిశలనెల్లెడ గుబాళింప
గాటంపువలియూర్పు కమ్మదెమ్మెరలు, మేటితుమ్మెదల నామెతలకుఁ బిలువ
జిలుకుపైఠాణికంచెల పిక్కటిల్లి, కులుకుసిబ్బెపుగబ్బిగుబ్బ లుప్పొంగ
బలితంపుచెంగావిపావడరుచులు, వలిపెక్రొందగటచ్చువల్వపై బొదల
మంజులాలంకారమణిగణకిరణ, పుంజము ల్కడల విప్పుగ గప్పుకొనఁగ
ఘంటల మొలనూలి ఘణఘణధ్వనుల, నంటి జంటగ గిల్కుటందియల్ మొరయ
మురువైన హురుమంజి ముత్యంపుసరులు, పరిపరిగతుల గుబ్బలపై నటింప
కొరమించు తొలుకరిక్రొమ్మెఱుం గనఁగ, చెఱకువిల్తుని వాడిచేకత్తి యనఁగ
తొగలసంగడికాని తునియ యనంగ, పొగడొందు జంత్రపుబొమ్మ యనంగ
లలితంపునవపుష్పలతికయో యనఁగ, జిలిబిలివలపులఁ జిక్కి యక్కోమరుఁ
దప్పకఁ గన్గొని తడబా టెసంగ, గుప్పుగుప్పున దూరె గుప్పెళ్లకొలఁది
గుప్పెడు మరునివాల్కోలసోకులకు, ముప్పిరిగొను మోహమున బిట్టుసోలి.

ఔర వీనియొయార మరయ వేమారు, మారుఁ గుబేరకుమారు వేమారు
సౌరలతాంగులీసౌ రలరారఁ, గోరి చూచిన పూలకోరినజీరు
దాడి నెంతేనియుఁ దల్లడపడుచు, వీడరేగుట్టెల్ల విరహాబ్ధి మునిఁగి
యమ్మమ్మ వీని సోయగ మెల్లనోలిఁ, దమ్మిచూలికినైన దరమె వర్ణింప

గద్దరిజమిలిముక్కాలిచాల్ దెగడు, నిద్దంపు నిడుదపెన్నెఱకులవాఁడు
నిండుపున్నమకల్వ నెచ్చెలికాని, దండి నేలెడు మోముఁదామరవాఁడు
మరునిసింగిణుల వేమఱు నుద్ది మీఱి, పొరి నెగ్గులెన్ను కన్బొమ్మలవాఁడు
కలువరేకులసొరుఁ గాదని కేకు, కలికిబిత్తరిసోగకన్నులవాఁడు
మొగిఁ గ్రొత్తసంపంగిమొగ్గచాలుపుల, నగెడు చొకారంపునాసికవాఁడు
మలయుచు గుజ్జులేమావిచిగుళ్లఁ, గిలకిలనవ్వు నున్గెమ్మోవివాఁడు
మొల్లమొగ్గలసొంపు మొగి దుటారంపుఁ, బ్రల్లగదంబున గెల్చు పలుచాలువాఁడు
కలికి రేయెండనిగ్గులు వెదజల్లు, నలువైన చిన్నారినవ్వులవాఁడు
తళుకుటద్దపుడాలు దలకింపఁజాలు, చెలువంపు క్రొంజిగిచెక్కులవాఁడు
కడఁగి తొమ్మిదవలెక్కల లెక్కఁ గొనక, వెడఁదలై గన్పట్టు వీనులవాఁడు
డంబారుబవరిగడ్డమువాఁడు సోయ, గంబూనుదరనిభకంఠంబువాఁడు
హరితనూభవ హస్తిహస్తోపమాన, పరికలితాజానుబాహులవాఁడు
వాటంపు వజ్రకవాటంపు గుంపు, నీ టెల్ల నుడిగించు నెరఱొమ్మువాఁడు
కొదుగక సింగంపుఁగొదమకూటువల, నదలింప దొరకొను నలఁతికౌన్వాఁడు
హెచ్చుగా గాటంపుటిసుకదిన్నియల, పిచ్చలింపఁగ నాడు పిరుదులవాఁడు
హరువైన నాడెంపు టనఁటికంబముల, గురుతరోన్నతి నెన్ను కురువులవాఁడు
తొడరి మారుని యంపదొనలసొంపెల్ల, సడలింపఁ దమకించు జంఘలవాఁడు
దట్టంపుజిగి మెట్టతామరవిరుల, నట్టిట్టుగాఁ బల్కు నడుగులవాఁడు
జిగిమించు మేలిపసిండిసలాక, నిగనిగల్ జరిగించు నెమ్మేనివాఁడు
హా యిజ్జగన్మోహనాకారుతోడఁ, బాయక వర్తించుభాగ్యంబు నాకు
నెనయవల్వాదె పురాకృతపుణ్యమహిమ, నసుచు దిగ్గన వాని నరలేక కదిసి
వినయంబు నొరవును వేడ్కయు వలపు, నెనరును మురిపెంబు నెఱపుచునున్న
మెలఁతుక కారాచమిన్న మ్రొక్కుటయుఁ, గిలకిలనగి వాని కేలు పట్టుకొని.

పగడంపుసకినెల పట్టిమంచంబు, తగటుబాలిసు మేలుతాపితాపఱపు
దిట్టంపుపని దోమతెర జరతారు, పట్టియ జిలుగుహొంబట్టుతలాడ
చందుగపెట్టియల్ జరబాబుజీబు, చందువాముత్తెంపుసరుల జాలీలు
పన్నీటిగిండ్లు సంపఁగినూనెక్రోవి, చిన్నారియడపంబు చిలుకపంజరము
గందపుసాన చిక్కపుగట్టె పెద్ద, మందసంబు విచిత్రమణిగవాక్షములు
కపురంపుబరిణె చిల్కలదివ్వెగంబ, మపరంజివీణ పూటత్తరుకుప్పె
తూగుటుయ్యాల లక్కదూవెన తబుకు, బాగాలసంచి కప్రపుపేర్ల పుటికె
నీలంపుకిటికిటీల్ నిలువుటద్దములు, జాలవల్లికెలు పచ్చలగద్దెపేట
పసిఁడిపావలు తమ్మపడిగంబుపూల, విసనకఱ్ఱలు గొప్పవింజామరములు
వలపారు గోనజవాదిపంకిణులు, కలపంపుగోర నున్గస్తురిపెట్టె
కాటుకమచ్చెంబు గరుకరాటంబు, నేటైన చిటిచాప నెత్తంపుఁబలక
చిత్తరుగోడలు చికిలిమ్రుగ్గులును, పుత్తడితలుపులు పులుగురామెట్లుఁ
గలిగి కన్నులపండువులుగ నెలుంగు, బలుమానికెంపుటొప్పరిలోని కతని
కొంకక సరగదోడ్కొని చని పట్టె, కంకటిదరిఁ బైడిగద్దియ నునిచి
పసిఁడిగొప్పెరలతోఁ బన్నీరు దెచ్చి, సొసఁగ నాతనిపదాంబుజములు గడగి
మలయజాగరుమృగీమదఘనసార, మిళితాంగరాగంబు మెయినిండ నలఁది
వలపులుగుల్కు చెల్వపుబోడ్డుమల్లె, యలరుటెత్తులు దద్ద యక్కువనుంచి
యపరంజిరేకుల ట్లడరునాకులును, కపురంపుబాగాలు కాచుటుండలును
ముత్తెపువలిసున్నమునుఁ గూర్చి మిగులఁ, బత్తిఁ దాంబూల మప్పనము గావించి
ఘనతరనవరత్నఖచితభూషణము, లనుపమచీనిచీనాంబరంబులును
కనకపాత్రికల ముంగల కానుకలుగ, నినిచి కురంగట నిలిచి నెత్తాని
క్రొన్నన సురటి చేకొని వలినాలి, సన్నగాడ్పులు వెదఁజల్ల వీచుచును
చిలుకపతాణితేజీవజీరుండు, బలుగబ్బిగుబ్బగుబ్బలులపై నినుచు
కఱకుక్రొవ్వాడిచెంగలువపూములుకు, లరిమురి చురఁజుర నదరంటిపార

నిలంపుగాజుల నెరిమించు పసిఁడి, కిలుకడెంపుడాకేలుచన్గుబ్బ
కెలనికి దార్చుచు క్రేఁగంటివాడి, సొలపుఁజూపులు కూర్మి జొప్పడఁజేయ
చిన్నారితెలినవ్వు చెక్కుటద్దముల, వెన్నెలనిగ్గులవిధ మొదవింపు
కమ్మచక్కెరపానకమ్ము లిమ్మెనరఁ, గమ్ము నున్గెమ్మోవి గదలిచలింపఁ
బలుకులఁ గపురంపుపలుకులు వొలియఁ, గులికి యచ్చిలుకలకొలికి యిట్లనియె.

రాజకుమారచంద్రమ నీహొరంగు, భూజనంబులు దద్ద బొగడ నేప్రొద్దు
వీనులవిందుగా వినుచుండి యెన్నఁ, డేనియుఁ జూతునం చెంతయు మదిని
నివ్వటిల్లెడుకూర్మి నిచ్చలుఁ బెరయ, నువ్విళులూరుచు నుడుగకయేచు
కళుకుపెంచెళుకువిల్కానిఢాకలకు, మొళకపల్గాకిపెంపుడుల కూకలకు
నెరయు నాటంపుపన్నీటివాకలకు, మెరయుటాటోటు తుమ్మెదలప్రోకలకు
తులువ చెంగలువబందుగుని కాకలకు, కలికిరాచిలుకటక్కరులమూకలకు
కొలఁకుల నెత్తావిపోకుడుల వీకలకు, మలయుకెందలిమలిమాలిమ్రోకలకుఁ
దద్దయు నుల్లంబు దల్లడిల్లంగఁ, బ్రొ ద్దొకయేడుగాఁ బొదలింపుచుండి
పున్నమరేఖేనిఁ బోలు ని న్నిపుడు, కన్నులపండువుగాఁ గనుంగొంటి
కొనసాగె పుణ్యంబు కోర్కె లీడేర, మును నోమినట్టి నోములు ఫలియించె
గామిడియై పెక్కుకడగండ్లఁ బెనచు, కాముని కొకబొమ్మఁ గట్టితి నింక
నెప్పుడు నీరాక కెదురుచూచుచును, ముప్పిరిగొను మోహమునఁ గ్రాగుచుండు
పతిఁ బాసి వలవంతబడలు నివ్వేళ, గతియైతి వుసురులు గాచి రక్షింప
మేలు నీవొనఁ గూర్చు మేలు మరల్పఁ, జాల ని న్నెపుడు నాసామిగాఁ దలఁతు
జాగేల నాకోర్కె సఫలంబు జేసి, భోగింపు మిచ్చుట పూసెజ్జఁ జేర్చి
పెట్టినకానుకల్ ప్రేమఁ గైకొనుము, పట్టుగ నన్నుఁ జేపట్టుమటన్న,
అననినాయకసూనుఁ డప్పుడు వీను, గవకు వేడిసలాక గాడిన ట్లగుచు
బెడిదంబుగా పెద్దపిడుగునుబోలు, చెడుమాట యాలించి చిత్తంబు దలక
శివ మహేశ శశాంకశేఖర యనుచుఁ, జెవులు మూసికొని వచించె ని ట్లనుచు.

చెల్లంబొ కటకటా చెప్ప నబ్రముగ, తల్లిరో యిట్లాడ ధర్మంబె నీకు
పరికింప నెరరాచపడఁతు లెందైత్య ధర నన్యపురుషులఁ దలఁపఁగోరుదురె
చెవులకు వినరాని చేడ్పాటుమాట, శివశివా వాక్రువ్వ జెల్లునటమ్మ
కన్నియ యిటువంటికరతలు విన్న, విన్ననై జను లెల్ల విస్మయపడరె
నీతివో విడిచెదు నీ వొక్కవిధము, మాతల్లి రత్నాంగి మఱియొక్కవిధమె
మదిరాక్షి నే నీకుమారుండ నాకు, గొదుగక యీపెద్దకొలఁ గట్టఁదగునె
కలికిరో నీవంటిగరిక లిట్లైన, నిల వల్వదనువార లెవ్వరు గలరు
వనిత న న్నొకలాతివానిఁగాఁ దలఁచు, కొని యుపచారముల్ గూర్పనాయంబె
క్షితిఁ దల్లిదండ్రు లార్జించిన సొమ్ము, లతివ పుత్త్రులవిగా కర్తయ నెవ్వరివి
నీవిచ్చు సొమ్ము లిందే దాచుకొందు, కావలసినవేళ గైకొందు జుమ్ము,
సితకరవదన నాచేతిపార్వంబు, గతి దప్పి వచ్చి నీకడ నుండుటయును
దానికై నగరివో ధరణీశ్వరుండు, లేనిచో నైన వాలెము జంకులేక
పినతల్లినని యాత్మఁ బెద్దయు నమ్మి, చనవున జేరి నీచరణపద్మములు
గనుఁగొని మ్రొక్కంగఁ గంటి వాల్గంటి, కనికరం బెలయ నాకలరవోత్తమము
నిడి సత్వరంబున నింటికి బనుపు, మిడుమలఁ బెట్టక యిడుమాజ్ఞ యనిన.

కలకల నవ్వి ఎక్కలకంఠకంఠి, పలికె నిట్లని యహా బాపురే యెందుఁ
బంతంబు వోనాడి పడఁతి దావలచు, నంతకన్నఁ గొఱంత యవనిపైఁ గలదె
పార్వంబు నెపమూని భావంబులోనఁ; బర్వుకోరికల నాసజ్జకు వచ్చి
యక్కట నాచేత నాడింపఁబూని, చిక్కులఁ బెట్టఁజూచెద వేమొకాని
నీచొకారంబును నీజాణతనముఁ, జూచిన యమ్మాట చోద్యమై దోఁచె
సంతసంబున మున్ను చల్లకుఁ బోయి, ముంత దాచినయట్ల మోమోటమేల
వలనొప్ప నృపుభోగవనితను గాని, తలఁప నే నీపినతల్లిని గాను

నీకుమారుఁడనంచు నిజము పల్కితివి, నాకు మారుఁడవె డెందమున భావింప
పాపంబునకు భీతిపడియెద నాస, వాపుటకన్నఁ బాపం బింకఁ గలదె
వలువనివావులు వరుసలుఁ దెచ్చి, కలిగిన మేలువో కడవెట్టుకొనెదు
చేతికి వచ్చు నిక్షేపముఁ బార, వేతురే యేలాఁటి వెంగళులైన
కామించి తనపట్టిఁ గవసినయట్టి, తామరచూలికి త ప్పేమి గలిగె
గురుపత్నిఁ గూడిన కువలయాప్తునకుఁ, బరికింప మఱియేమిపాపంబు వొదవె
దోసంబు మఱదండ్రతోఁ బొందొనర్చు, వ్యాసనంయమి నేమి యాపద బెట్టె
గొదుగక మునికాంతఁ గూడినయట్టి, త్రిదశేంద్రు నేమి బాధించెఁ బంకములు
మేనత్తతోఁ గూర్మి మీఱ వేమాఱు, మీనకేతనుకేళి మెలఁగిన కృష్ణు
నెవ్వార లెగ్గుగా నెన్నిక యిడిరి, కావున నీవెఱ్ఱికరతలు మాని
హాళి రాచిల్కవయాళి గయాళి, కేళి నేలుము కవుంగిట గదియించి.

అనవుఁడు నృపపుత్త్రుఁ డహహ యోయమ్మ, మును దేవతలు చోద్యముగఁ జేసినట్టి
పనులు వారికి చెల్లుబడియయ్యెఁ గాక, మనుజుని కట్టులేమాడ్కిఁ బొసంగు
పరికింప వసుమతిపాలుని భోగ, తరుణిని గాని నీతల్లిఁ గా ననుచు
ధవళాక్షి వాక్రువ్వధర్మంబె నీకు, శివశివా మఱిపావిచెడ మందు గలదె
వేండ్రంపుఁబలు కిందు వింటిమి గాని, తండ్రి గైకొనునింతి తల్లియ కాదె
యారనిచల మూని యమ్మరో మిగుల, నారడి నిడుట మేలా నీకు నన్ను
[గ్రంథపాతం]
కొను కెంపుటఱ్ఱలోఁ గ్రొన్ననపాను, పునసుంచి యందు నేర్పున వ్రాసినట్టి
చిత్తరురూపులఁ జేసన్న జూపి, బిత్తరి యతనితోఁ బ్రేమ ని ట్లనియె.

మది జెలంగి కుమారమన్మథ చూడు, మదె నందనందనుం డర్మిలి నొక్క
కులుకుఁబ్రాయఁపు గొల్లగుబ్బెత గుబ్బ, లలమిపట్టి నఖంబు లదిమినసొగసు
కనుఁగొను మదె యొక్కకలికితోఁ గృష్ణుఁ, డెనసి కౌఁగిట గదియించిన బాగు
వీక్షింపు మదె యొక్కవ్రేతతో నెన్నుఁ, డిక్షుకార్ముకకేళి నెనసినలాగు
రాధ పైకొని యువరతి సేయఁ జెలఁగు, మాధవు నదె చూడుమా ధరాధీశ
యిద్దఱుచెలులపాలిండ్లు హస్తములఁ, దద్దయు బిగబట్టి తమి నొక్కముద్దు
గుమ్మ క్రొందళుకుచెక్కులు ముద్దు గొనెడు, కమ్మవిల్తుని తండ్రి గనుమదేమొ
గాధిసూనుఁడు మేనకను గూడి పల్ల, వాధరం బానుట యల్లదే చూడు
దారుకావనమౌని దారలఁ గలసి, కేరెడు నదెచూడు గిరిసుతారమణు
నదె చూడు మునిపత్ని నంటి జంభారి, మదనాహవమున నెమ్మదిఁగేరు తీరు
తొడలపై రతి నుంచి తొడరిముద్దాడు, వెడవింటిదొర నదె వేడ్క గన్గొనుము
గురుభామ యగు తారఁ గూడి సంభోగ, సరణిఁ దేలెడు నదె జాబిల్లి జూడు
రాజరాజసుతుండు రంభతోఁ గలసి, గాజుటోపరిలోనఁ గడఁక ననేక
చిత్రబంధంబులఁ జెలఁగెడుచొప్పు, ధాత్రీశ యల్లదె తప్పకఁజూడు
మనుచుఁ జిత్తరురూపులన్నియుఁ జూపి, పెనచు మోహమున దూపిలుచున్న నతఁడు
తలవంచి మఱల నుత్తర మీక మదిని, గలక మీర పరాకుగానున్న నలికి
యలికి కేకులహాళాహాళికి చిల్కలర, వలికి గద్దరి పికావళికి పూఁబొదల
వలికి మందపుకరువలికి పేటాడు, కలికిరాయంచతెక్కలికి చెంగలువ
చెలికి గాటపుసూడుచిలికి క్రొందమ్మి, ములికి మొత్తముల నిమ్ముగ గ్రుమ్మి నెమ్మి
గులికియార్చు కడిందికూళయంకిలికిఁ, గలికి వోనులికి యక్కటకటా వీఁడు
చలిగూటిపై వెన్నసరణి నించుకయుఁ, జలియింపకున్నాఁడు జాగేల యింక
బలిమిఁ బైకొనియైన భావజుకేళిఁ, గలసి భోగింపక గాదని చూచి
కరకంకణధ్వనుల్ ఘంటారవములు, చరణమంజీరనిస్వనములుఁ జెలఁగ
గొదగొని నెత్తమ్మికొలఁకున కురుకు, మదముటేనుఁగగున్నమాడ్కి పైఁబడియె
అటుల పైఁబడు బల్లయాళి ప్రోయాలి, నటు ద్రోచి గుండె ఝల్లని విలిపొర
హా పరమేశ మహాదేవ యనుచు, భూపసూనుఁడు సొమ్మబొంది వే తెలిసి
ప్రెగడబిడ్డఁడు మున్ను బెక్కుచందములఁ, దగిలి చెప్పినమాట తలఁపున నిడక

తివిరి వచ్చుట కిట్టిదెసఁ జెందవలసె, నవునీశ్వరాజ్ఞఁ ద్రోయఁగ వశం బగునె
యని దలయూచుచు నసురుసురనుచుఁ, గనుదోయికొనల వెక్కసముగ జాలు
కొనుభాష్పకణములు గోళ్ల మీటుచును, తనువు గంపింప గద్గదకంఠుఁ డగుచు
పెదవులు దడపుచు పెంపెల్లఁ దూలి, కొదుగుచు దైన్యంబు గొరల నవ్వాలు
గంటిఁ గన్గొని పల్కెఁ గటకటా యిట్టి, కొంటితనంబుఁ జేకొనియె దేమిటికి
తల్లి పురంధ్రిమతల్లి యనంగ, నెల్లగా బ్రతుకుట యెల్ల మేల్గాదె
చేతి మామిడిపండు చెదరంగ వైచి, యాతలిముసిడిపం డర్థించినట్లు
నిరుపమగుణుఁ డైన నృపుని వంచించి, పరునిఁ గామించుట పాడియె నీకు
పరకాంతఁ దల్లిగా భావించు నేను, హరహర పినతల్లి నంటఁగోరుదునె
పరమేశునాన నీపదములసాక్షి, ధరణీశునాన నిన్ దలఁప నింతైన
నెరవెఱుంగక వట్టివేఁటిఁడి వగుచు, ధర నపకీర్తిఁ జెందఁగఁ గోరె దేల
వినువిను నాబుద్ధి వివరించిచూడు, పనివినియెద నింక పార్వంబు నొసఁగు
మనుచు దిగ్గున లేచి యరుగ నూహించు, జననాథసుతుని కేల్ సయ్యన బట్టి
గురుకుచ క్రమ్మఱఁ గూర్చుండఁబెట్టి, దరి లేని మదనవేదనలఁ గాసిలుచు
మాటికి వరదలై మానకతొరుగు, కాటుకకన్నీరు కడకు మీటుచును
కొలఁదికి మించు డగ్గుత్తికతోడ, నెలయ నెలుంగున నిట్లని పలికె.

ఔర మారునకు నన్నగ్గము చేసి, యూరకె జుడిగిపో నూహించెదేమొ
పిల్లిపట్టిన కోడిపిల్ల కెందైన, నల్లన జుడిగిపోనగునె చర్చింప
గట్టిగా నిన్ను నాకౌఁగిటఁ బట్టి, బిట్టు మారునికేళి బీడించి కోర్కె
దీర కెందలిరువాతెఱపానకంబుఁ, జూరలాడక మానసుమ్ము నీయాన
యెఱుఁగనేరవుగాక యెన్నిపుట్టువుల, తఱినబ్బు మకరకేతననిశాతాస్త్ర
జాలవ్యధాభిన్నసకలాంగు లగుచు, కేలఁ గపోలముల్ గీలించి పైని
గాలి సోకిన వెన్నకరణిఁ గరంగు, గోలలఁ గౌగిటఁ గూర్చు భాగ్యములు
బహుయత్నములఁ గుంది పడయంగరాని, మహిళావతంసంబు మరుకేళి గోరి
మక్కువతో బతిమాలిన వినక, విక్కి చిక్కులు బెట్టు వెంగళి గలఁడె
కోతికి నబ్బిన కొబ్బరిపంటి; రీతియై తోచె నీరీతి యివ్వేళ
పడుకైనఁ గరఁగి వేబదనగుఁగాని, గడితంపునీమది గరఁగదయారె
యేలరా రతి దేల్చి యేలరా తాళ, జాలరా మదిలోనఁ జాల రాగిలితి
కూళరాచిల్కబల్గుట్టుపుజోదు, పాల రాపడనీక బ్రతికింపు మిపుడు
ప్రాణదానముకన్న బరమధర్మంబు క్షోణిలోఁ గలదె నిక్కువ మీ వెఱుఁగవె
సారెకు దల్లియన్ శంక నొందకుము, వారకాంతల కెందు వావులు గలవె
నీవంటి సద్గుణనిధి కివ్విధమున, నావంటిచెలి నేచ నాయంబు గాదు
ద్రోహివై యిపు డాసఁ ద్రోచితివేని, స్త్రీహత్య నీ కిట సిద్ధించుఁ జుమ్ము
కావున నికఁ బెక్కుకఱదలు మాని, క్రావు నన్మరునికాకులఁ గుందనీక
యనుచు వాకిలి మూయ నటునిటుఁ జూచు, వనితచొ ప్పెఱిఁగి భూవరసుతుఁ డపుడు.

పట్టినపంత మిప్పాపాత్మురాలు, గట్టిగా మాన దేకరణిఁ దెల్పినను
కామాంధకారంబు కన్నులఁ గప్పి, యేమియుఁ గ్రిందుమీఁ దెఱుఁగదు దీనిఁ
బొదవినఁ గందర్పభూతంబు నింక, వదలింప నేరికి వశము గా దనుచు
గుప్పున లేచి యెక్కువ దిగుల్ మీఱఁ, దప్పించుకొని పోవఁదలఁచిన నెఱిఁగి
యప్పడంతుక వాని కడ్డమై పెనఁగి, దుప్పటికొంగుఁ బొందుగ కేలఁబట్టి
యౌనవు మేలు మే లౌర నీబుద్ధి, మానవుగద యెంత మంచి జేసినను
ఫలరసాస్వాదంబుపసయెల ముద్దు, చిలుకగా కెఱుఁగునే చెనఁటికాకంబు
మృదుమరందముతావి మేలైన తేఁటి, కొదమగా కెఱుఁగునె గొంటుజోరీగ
కామినీసంభోగకలనాసుఖంబు, పామరుఁ డెఱుఁగునె బలుదంటగాక
వేమఱు బతిమాలి వేఁడిన వినక, సోమరినై రిత్తజుఁడుగఁ జూచెదవు
కొమరుఁబ్రాయఁపుముద్దుగుమ్మకౌగిటను, తమిఁ జెలంగని మగతన మది యేల
చెలువుఁడ కౌగిటఁ జేర్చ కెంబెదవి, పలుచని చక్కెరపానకం బాని

తళుకులేజెక్కుటద్దములు ముద్దాడి, యలరువిల్తునికేళి నలరింపు మనుచుఁ
జేయెత్తి మ్రొక్కిన శివశివా యెంత, గయ్యాళితన మూనెఁ గలికి యటంచు
నాకొన్న పులివాత కబ్బిన కంచి, మేకచందంబున మెత్తబాటూని
యేమియుఁ దోఁచ కాన్నపకుమారకుఁడు, పైమీఁది దుప్పటి పాఱంగ విడిచి
సరగున నవలికి చంగున దాటి, యరిగె రాహువుచేతి యాతనఁ బాసి
బొనర షోడశకళాపూర్ణుఁడై యెలమిఁ, దనరారు సారంగధరుని చందమున
అటు లేగు నృపతనూజాగ్రణిఁ జూచి, తనరఁగఁ జేతివిత్తము పోయినట్లు
మొగము వెల్వెలఁబాఱ మురియెల్ల సడలి, పొగలుచు వేడియూర్పులు సందడింప
నుసురంచుఁ గొఱకొఱ యుప్పతిలంగ, బిసరుహాసన పండ్లు పెటపెటఁ గొఱికి
యోరిటక్కరికాన యోజ లే కిట్లు, పారావతంబు నెపం బూని వచ్చి
రమణుఁ బాసి విరాళిఁ గ్రాగుచో మిగులఁ, దమి చేచి చనెదుగదా తాళుతాళు
మంచిది కానిలే మాబాగు రాజు, వంచన లేక రావలెఁగదా నిన్ను
గట్టిగా నెన్నైనఁ గల్లలు జెప్పి, కట్టి నట్టడవిలోఁ గాళ్లుఁజేతులును
జెలపింపకున్న యిసీ మారుపేరఁ, బిలువగ నన్ను నప్పిమ్మట నింక
ననుచుఁ దర్జనిఁ జూపి యదలించి పలుకఁ, గని గుండె లవసిపోఁ గాళ్ళాడ కతఁడు
నిలిచి యయోతల్లి నీతప్పు దెచ్చి, యళుకక నాపయి నంటించి కినుక
దండింపఁజూచుట తగవె నీమాట, దుండగంబున నేమి ద్రోచితినమ్మ
కొలవచ్చుపని కియ్యకొనుకుంటిఁ గాని, మెలఁతరో నీయాజ్ఞ మీరుట లేదు
నిముషసౌఖ్యమునకై నెరయ దుఃఖముల, జమునిచేఁ బడలేక జంకెద నింక
విభుఁడును నీవు నెవ్విధి నొనర్చినను, శుభగాత్రి దైవాజ్ఞ సు మ్మటమీఁద
తల్లి విషం బిడ్డ తం డ్రమ్ముకొనిన, నెల్లెడ మాన్పువా రెవ్వఱు గలరు
సెలవిమ్ము పోయివచ్చెద మదిఁ దల్లి, యలుగక దయయుంచుమని యటఁ దరలి
తమనగరున కేఁగి తజ్ఞుల రాచ, కొమరుల నిండ్లకు గొబ్బున బనిచి
యంతఃపురంబున కరిగి యత్యంత, చింతాసమేతుఁడై చెయివొంది నులక
కంకటిపైఁ బడి కడయిడరాని, జంకున గుండియల్ ఝల్లుఝల్లనఁగఁ
బండుచు లేచుచుఁ బలవరింపుచును, కొండ పైఁబడ్డలాగున వ్రేగుగదుర
నుసురంచుఁ బొరలుచు నూర్పులు నిగుడఁ, బస చెడి దైన్యంబుఁ బాదుకొనంగ
నయ్యయో పార్వంబు నాకసంబునకు, నెయ్యంబుతో నేల నెగరవైచితిని,
వైచిన మఱల నావంకకు రాక, యాచండిపులుఁ గేల యట తేలి పోయె
పోయెఁబో మఱియెందుఁ బోవక యదియె, దాయయై చిత్రాంగిదరి నేల వ్రాలె
వ్రాలిన నట్టె పోవఁగనీక యేల, బేలనై దానికై బిరబిరఁ జనితిఁ
జనినఁ బార్వంబు నొసంగ కాయమ్మ, మనసునఁ గొఱగానిమా టేల దలఁచె
తలఁచినఁ గాదని తప్పించుకొనిన, నలిగి దండించఁగ ననఁగ నేమిటికి
కొఱమాలి విధి యెన్నిగొడవల నిడిన, నెఱిఁగి పోనిడుకొన నెవ్వరితరము
మంచిది విధుకళామౌళి యేరీతి, ముంచిన నారీతినుండక తీర
దాయమబాధనం దడలుటకన్న, నీయమబాధ నిందేమైన లెస్స
యనుచు డెందమున మహాదేవు నభవు, నునిచి తద్దయు ధైర్య మూనుకొనియుండె.

అక్కడఁ జిత్రాంగి యాత్మలో మిగుల, నక్కుమారకుని యొయారంబుఁ దలంచి
హా వాఁడు నావల పాఱడిఁజేసి, భావజున్మనిబారిఁ బడఁద్రోచి చనియె
మధుకరంబులకు మన్మథుశరంబులకు, మధుపరభృతకీరమందసమీర
విధుకరంబులకు నెవ్విధిఁ దాళుకొందు, విధి యొదవించు బల్వెత కేమి యందు
నేమి సేయుదు నింక నెటువలె నోర్తు, నీమహావిరహాబ్ధి నెబ్బంగిఁ గడతు
నమ్మకచెల్ల నాయట్టి సుందరికి, యమ్మోహనాంగుపొం దలవడవలదె
మరుఁడు వేలుపురాకొమరుఁడుఁ గురంగ, ధరుఁడుఁ గుబేరనందనుఁడును వాని
కాలిగోరున బోలఁగలరె యయారె, చాల నెన్నికఁ గన్న జగవన్నెకాడు
వానికౌఁగిటిలోన వదలకఁ గదిసి, సూనచాపునికేళిఁ జొక్కకయున్న
యీజవ్వనం బేల యీసొగ సేల, యీజగరం గేల యీఠీవి యేల

కటకటా వానితోఁ గట్టడి నలువ, కుటిలుఁడై యేటికిఁ గూర్చకపోయె
ననుచు నగ్గల మైన యంగజవ్యథల, మునుఁగుచుఁ బలుగోరములఁ గుంద నపుడు
ముద్దుగుమ్మకు శిలీముఖ మయ్యె తేఁటి, తద్ద యాశుగ మయ్యెఁ దరుణికి గాడ్పు
కలికికి పుండరీకం బయ్యె తమ్మి, పొలఁతిక సురపొన్న పున్నాగ మయ్యె
శర మయ్యెఁ జెలికి కొజ్జంగిపూనీరు, హరిణేక్షణకు బర్హి యయ్యెను నెమ్మి
యతివ కగ్నిశిఖాంశ మయ్యె గుంకుమము, సతికిఁ గర్పూరము ఘనసారమై యొప్పె
మరియు గాటంపుటుమ్మలికెల ట్లెలయ, తెఱవ మెల్లనె సోలి తెలివొంది సారె
హరహర యంచు రామా యంచుఁ జక్ర, ధర యంచు మకరకేతనకోకిలాని
లములదాడికి లోఁదలంకి పల్కుచును, గమకమై తద్దయు గాటమై మదిని,
బెనఁగొను కినుకచే బిరబిర లేచి, మునుకొని మేనిసొమ్ములు దీసివైచి
కులుకుగుబ్బలు వాడికొనగోళ్ల నెత్తు, రులు జాలువారంగ గ్రుచ్చి ద్రచ్చుకొని
పొసఁగ దట్టఁపుమైలపుట్టంబుఁ గట్టి, నొసలఁ గస్తురిబొట్టు నూల్కొనఁబెట్టి
తలను వాసెన గట్టి తడయక కట్టి, బలుచీఁకటింటిలోపల నొకమూల
నిలఁబడి మూల్గుచు నెనలేనివెతలఁ, బొలయుచు నుసురంచుఁ బొరలుచునుండె.

ఆలోన వనికి వేటాడంగ నేఁగి, వ్రాలనికడిమి మై వర్తిల్లుచున్న
రాజమాహేంద్రధరాతలాధీశుఁ, డాజగన్మోహినియైన జిత్రాంగి
చెలు వాత్మ దలఁచి కెంజివురువిల్కాని, ములికిమొత్తముల బాముల కోర్వలేక
కలఁగుచు రేయెల్లఁ గడపి వేకువను, తలకొనువేడ్క నత్తావున దరలి
దొర లగ్రమునఁ జెల్మిదొరల మెలంగఁ, గరము పెల్లున భటోత్కరము జెలంగ
గడలసామరులు నల్గడల వర్తింప, పడగలవా ర్మను పడగమియిండ
గములు గూడుకొ తురంగములపై నెక్కి, కొమరుఁబ్రాయఁపురాచకొమరులు నడువ
వంతుల నెక్కి మావంతులు మత్త, దండులపై మహోద్ధండత నలరఁ
బసిఁడిబెత్తులవారు బలసియిర్వంకఁ, బస నెసంగుచు బరాబరు లొనరింప
తురగరింఖాసముద్ధూతప్రభూత, ధరణీపరాగంబు తపనుని గప్ప
భేరులు తుడుములు పెద్దబూరలును, వీరకాహళికలు విప్పుగా మొరయ
నాలవట్టములు ముత్యాలవెల్లులును, జాలువాయరిగెలుఁ జామరంబులును
గొనియాడి గీలుడాకొన వెంటరాగ, నెనలేని బలుఠీవి యెసఁగ నేతెంచి
మణికేతనముల హేమనికేతనముల, గణికారమణుల ముక్తాహారమణుల
జవఘోటకముల నుజ్జ్వలహాటకముల, నవతోరణముల నున్నతవారణముల
వనజాలకముల కేవలజాలకముల, ఘనవితానముల సత్కవివితానముల
రాజమార్గముల నీరంధ్రదుర్గముల, వాజిశాలికల సువర్ణడోలికల
ననమసౌధముల దివ్యావరోధముల, ప్రసవవాటముల శుంభత్కవాటముల
భద్రవాద్యముల నేపథ్యచోద్యముల, శూద్రనాయకుల నక్షుద్రగాయకుల
నృపతనూభవుల నిర్ణిద్రవైభవుల, విపణిపద్ధతుల సంవృతబలోద్ధతుల
శ్రుతినినాదముల విశ్రుతవినోదముల, క్షితిసురావళుల నంచితమహాకులుల
వివిధవర్తకులఁ బ్రవీణనర్తకుల, సవనధామముల యోషాలలామముల
సరిదనీకముల శశ్వత్తటాకముల, వరతపోధనుల భాస్వరవణిగ్జనుల
ననయంబుఁ గడుమనోహరలీల నెలసి, తనరారు తనరాజధాని సొత్తెంచి
వందిమాగధులు కైవారముల్ సేయఁ, గ్రందుగా నర్తకీగణము నర్తింపఁ
గలధౌతపాత్రలఁ గప్పురఁబుటార, తులు నించి పుణ్యాతతుల్ నివాళింప
నెలరాలమేడల నిలిచి నాడెంపు, వలువల ముత్యాలసేసలు జల్ల
తొడరి సోరణగండ్ల త్రోవల రాచ, పడతు లీక్షింపుచు భళిభళి యనఁగ
నాగమోక్తముగ ధరామరోత్తములు, మూఁగి యాశీర్వాదములు జొనరింప
నుడుగక నాగరు లుడుగరలిడుచు, బొడగన శుభతూర్యములు బిట్టు మొరయ
కొలువుకూటము సొచ్చి కొంతసే పచటఁ, గొలువుండి యెల్ల గొబ్బున బనిచి
యంతఃపురంబున కరుదెంచుటయును, జెంతల నుడిగెంపుఁజేడియల్ డాసి
తరల సంపగి నూనె దయంటే రాజ, తిలకంబునకు విభూతిలక మొకరు.

నలువగాఁ గస్తురినలు గిడె నొక్క, తెలిరాకుఁబోడి భూతలమహేంద్రునకు
కలయగంధామలకం బిడె నొక్క, కలిక నృపాలశేఖరుని యౌదలను
చాలుగొజ్జెగనీట జలకంబులార్చె, కలకంఠకంఠ యొక్కతె నృపాగ్రణికి
తడియొత్తె నొక్కపుత్తడిబొమ్మ యొంటి, పడఁతుక వసుమతీపాలముఖ్యునకు
వలిపెమడుంగువల్వలు గట్ట నిచ్చె, జలజలోచన యోర్తు సార్వభౌమునకు
కలపంబు మేనిండఁ గలయనలందె, పొలఁతిమిన్న యొకర్తు భూనాయకునకు
చేరి క్రొవ్విరిసరుల్ సిగఁజుట్టె నొక్క, వారిజేక్షణ ధరావరకుంజరునకు
నవరత్నమయభూషణము లలరించె, పువుబోడియోర్తు సొంపుగ మహీపతికి
పసిఁడిపళ్లెరమున భామినియోర్తు, రసిరసాన్నము లిడె రాజన్యమణికి
యెంగిలివార్వ నీళ్లిడె నొకమోహ, నాంగి పొంగి మహీభృదవతంసమునకుఁ
గుదురొప్ప మణివీథిఁ గూర్చుండఁజేసి, సుదతియొక్కతె వీచె సురటి యేలికకు
కపురంపువిడె మొక్కకాంతాలలామ, నృపతి కందిచ్చెఁ బూనినవేడ్కఁ నపుడు.

అంత నాసర్వంసహాధినాయకుఁడు, సంతసంబునఁ బొంగి సయ్యన లేచి
పసమించు బంగారుపావలు దొడిగి, మసలక చిత్రాంగి మణిసౌధమునకు
నరుదెంచెఁ జెలియున్న యరుదెంచి పరగ, దరియంగఁ జని కృశోదరి యంగరీతిఁ
గనుఁగొని యిది యేమొకా కల్కి నేఁడు, గనుఁగొన నొకతీరుఁగా నున్నదనుచు
మెల్లనె యొద్ద నర్మిలిఁ గూరుచుండి, యుల్లంబు దలఁక నయ్యుగ్మలి కనియె
నెలఁతరో తల గ్రొవ్వి ని న్నెవ రేమి, పలికిరి కొఱగానిపలుకులు వారిఁ
దెలుపుమా పట్టి శోధించి నీయెదుటఁ, చలమారి దండించి చాల నెంచెదరు
నీమాటఁ జెప్పిన నీయాజ్ఞ వినిన, భామరో పారెడుపామైన నిలుచు
దొరలుఁ గింకరులు మంత్రులు పురోహితులు, గరియాన నీయాన గడవక యుండ్రు
తలఁపున మెలఁగుచు దవిలి యేఁ దిరుగ, నలుఁగఁ గారణ మేమి యలివేణి నీకు
తగు హంసతూలికాతల్పముల్ విడిచి, పొగలుచు నేలపై బొరలాడనేల
చీనిచీనాంబరశ్రేణు లుండఁగను, చానరో మలినవస్త్రముఁ గట్టనేల
తొడవులు సడలించి తోరంపుమేను, బడల పెన్గొడవకుఁ బాల్పడనేల
చిలుకబోదలను మచ్చికఁజేసి ముద్దు, చిలుకపందెంబులుఁ జెప్ప నేమిటికి
నెమ్మికూటువల నెన్నకె గూడపెట్టి, నెమ్మితో నాటలు నేర్పి వేమిటికి
బట్టిగాడుల కేలఁబట్టి యింపార, గట్టిగా మాటలు గరప వేమిటికి
తెలిపిట్టగమిఁ జేరఁదీసి మేల్ బుద్ధి, దెలిపి మెల్లనె నడల్ దిద్ద వేమిటికి
యెలనాగ సోయగం బెలయఁ జెలంగి, యెలమితోఁ దూఁగుటుయ్యెల లూగవేల
పెంపార వలిజిలిబిలిపాట పాడి, యింపుగా వీణె వాయింప వేమిటికి
తళుకుక్రొమ్మించుటద్దముఁ జూచి నొసల, నలఁతిఁ గస్తురినామ మలరింపవేమి
గమగమ వలచు చిక్కనిమంచిగంధ, మమరఁ జన్నుబ్బల నలఁద వేమిటికి
జిగిమించు క్రొత్తగొజ్జెఁగపూసరములు, సొగసుగాఁ గ్రొమ్ముడిఁ జుట్ట వేమిటికి
కలికిరొ చొక్కఁపు కపురంబుఁ గూర్చి, చెలువార దములంబు సేయ వేమిటికి
యిన్నాళ్లవలె నాకు నెదుఱుగా వచ్చి, చిన్నారినగవులు చెంగలింపంగ
కులుకుచు తళుకువాల్ కొనజూపు లెలయఁ, బలుమరు వలపాఱఁ బలుక వేమిటికి
చెల్లంబొ నీవరజేసి యిట్లున్న, తల్లడంబున నెట్లు దాళుకుయుందు
కలనైన నే నినుఁ గాదని మరుని, కలన నొండొకయింతిఁ గలయుట కలదె
చిలుకలకొల్కి నీచిత్తం బెఱుంగు, తలిరువిల్తుఁడె సాక్షి తామరసాక్షి
జగమున నీవంటి సరసురా లెందుఁ, గనపడదని సారె కాత్మలోఁ దలఁతు
కలికి నీపాలిండ్లు గజనిమ్మపండ్లు, పొలఁతి నీకెమ్మోవి పూదేనెబావి
చాన నీనెమ్మోము జాబిల్లిగోము, మానిని నీకురుల్ మరునివాగురులు
వనిత నీనూగారు వలిదేటిబారు, వినుతాంగి నీబొమల్ వెడవింటికొమలు
చెలియ నీమీఁగాళ్లు చిన్నితాంబేళ్లు, మెలఁత నీమేసౌరు మేల్మిబంగారు
మమ్ము నీకెనయైనమగువ లేదెందు, ముమ్మర సేయక మక్కువఁజూడు
వలరేని దాడి కోర్వఁగజాల నింక, చెలిమితోఁ గౌగిటఁ జేర్చి రక్షింపు

ముగుద నీకెమ్మోవి ముద్దొసఁగినను, పగడంబులును మంచిపలుగెంపు లిత్తు
నతివ నీవేనలి యంటనిచ్చినను, ప్రత్తిలేని వేల్పురారతనంబు లిత్తు
చెలువ నీచెక్కులు చేముట్టినపుడు, కళుకువజ్రపురాలు కానుక లిత్తు
ననబోఁడి నను(జూచి నవ్వినయపుడె, యనువొప్పు ముత్యాలహారంబు లిత్తు
కులుకుగుబ్బలు గోర గ్రువ్వ నిచ్చినను, వలనొప్పఁ బలుజవాబంతుల నిత్తు
చలము మానవె యింక చక్కెరబొమ్మ, మొలకనవ్వులఁ జూడు ముద్దులగుమ్మ
తాళఁజాలను సుమ్ము తలిరులేఁగొమ్మ, మేలమేటికి లెమ్మ మినుకుపూరెమ్మ
కాము నేలింపవె కపురంపుదిమ్మ, వేమరు నను(బ్రోవు వెలలేని సొమ్మ
యనుచు మోహము నిల్పనలవి గాకున్న, ఘనతరమాణిక్యఘటితకిరీట
చటులకాంతిచ్ఛటల్ జగతిపైఁ బర్వ, నిటలంబు వంచి తన్వికి మ్రొక్కులిడియె.

అటుల మ్రొక్కిన నగ్గయాళిపొలంతి, పటుగతిఁ దనదుకాపట్యంబు నెఱప
నిదె యదనంచు లో నెంచి యించుకయుఁ, గొరుగక రాజన్యకుంజరుం డులుక
నుసురంచు వేడినిట్టూర్పు నిగుడ్చి, ముసుఁగు మెల్లనె తీసి మూల్గుచు నేలఁ
గేలూనుకొని లేచి క్రేఁగంటఁ జూచి, వాలుఁగన్నులనీరు వరదలై పాఱ
గొడవలు బెరయ డగ్గుత్తిక మీర, బుడిబుడి నెడయేడుపులు దోపఁ బలికె,
జననాథ వేటకుఁజని నీ వరణ్య, మున నున్నచోఁ బ్రొద్దువోక రాచిలుకఁ
గరమునఁ బూని బంగరుమేడమీఁద, నిరవుగాఁ గ్రీడించు నెడలఁ బ్రాలేయ
కరరేఖయో యనంగా దివినుండి, పరుపడి నొకవెల్లపార్వంబు వచ్చి
చెంతవ్రాలినదానిఁ జేకొని మెలఁగు, నంతలో కడిదియొయారంబు మీఱ
పారావతంబు నెపంబున నిటకు, సారంగధకుఁడు వేఁ జనుదెంచి నన్ను
గనుఁగొని యత్యంతకామవికార, మున మే నెఱుంగక ముదమునఁ బలికె
మొలకపుత్తడిబొమ్మ ముద్దులగుమ్మ, వలపుగొజ్జఁగిబంతి వన్నెలదొంతి
యామటేనుఁగగున్న యన్నులమిన్న, గోములనడుదీవి గుజ్జులేమావి
వూఁపనెన్నెలనిగ్గ పొగడపూమొగ్గ, కైపుమీరినసొమ్మ కడిఁదిరాకొమ్మ
సోయగంబులప్రోక సొగసులవాక, కాయజువిరిచిల్క కలికిరాచిల్క
నీరూపు నీయేపు నీముద్దుజూపు, నీరంగు నీయంగు నీమేల్‌హొరంగు
నీయొప్పు నీచొప్పు నీజాణతనము, నేయన్నులకు నైన నిల నెన్నఁగలదె
వనిత నీకె జాలవలచితి నింక, ననవింటితులువచే నలియంగనీక
నీకవుఁగిటఁ గూర్చి నేడు నన్ బ్రోవు, చేకొను పుణ్యంబు చెలిమిఁ గైకొనుము
రాకేందువదన పారదమందహాస, కోకిలకలవాణి కుందాభరదన
మదమధువ్రతవేణి మలయజామోద, మృదుమధురసల్లాప మృగరాజమధ్య
పరిపక్వబింబోష్ఠి పల్లవపాణి, ధరనిభోజ్వలకంఠి తారకానఖర
లికుచవక్షోజ నాళీకపత్రాక్షి, ముకురకపోల జాంబూనదగాత్రి
కుసుమకోమలి హేమకుట్మలనాస, బిసబాహువల్లరి పృథుతరజఘన
భుజగరోమావళి పులిననితంబ, గజరాజగామిని కచ్ఛపప్రపద
కార్ముకభ్రూవల్లి కరభోరుకాండ, నిర్మలాభోగతూణీరోరుజంఘ
శ్రీకారకర్ణసరిన్నిమ్ననాభి, కోకనదోల్లస త్కోమలచరణ
యనుచు, నగ్గలపుమోహమునఁ బ్రార్థించు, చెనఁటిపైఁ గన్నెఱఁ జేసి యిట్లంటి
నోరి దురాత్మ నాయొడయండు వనికి, దూర మేగు టెఱింగి త్రుళ్లున వచ్చి
పినతల్లి యనక ముప్పిరిగొనుతమినిఁ, బెనఁగఁజూచెడు గ్రొవ్వు పెల్లున నహహ
మానంబు ప్రాణంబు మనుజేంద్రుసొమ్ము, గా నెంచి మెలఁగువైఖరిదాన నేను
నీవంటితులువమానిసిఁ బొందఁగలనె, పోపు మూరకె కానిపోకలఁబ్రోక
యని యదలించిన నడఁగక వాఁడు, ఘనతరకామాంధకారంబు గొట్టి
బలిమిఁ బైకొని బట్టి బాములఁ బెట్టి, కులుకుగుబ్బలు వాడికొనగోళ్ల వ్రచ్చి
కాఁగలపనియెల్లఁ గడతేర్చి పిదప, నేఁగె నన్నకనన్న నింకేమి చెప్ప
పొదలుముంజేకడంబున కద్దమేల, యిదె చూడుమంచుఁ బయ్యెద వాపి చూపి
కొమరుఁ డంటిననాఁడె కోడలనైతి, తమినింక నీ వంట ధర్మంబుగాదు

రతిసుఖంబులఁ దేల్చు రత్నాంగికడకు, క్షితితలాధీశ వేంచేయు మూరకయె
యీవిధమెల్ల నీ కెఱిఁగించుదాక, నోవసుధాధీశ నోర్చితి నింక
ననుఁ జూడుమంచుఁ గ్రన్నన ఱేనిచేతి, నునువాలు వెఱికి గొంతుకఁ జేర్చ నలికి
వనితకేల్ వట్టి యవ్వాల్ విడిపించు, కొని జననాథుఁ డక్కొమ్మ కిట్లనియె.

మెలఁతరొ నాయాజ్ఞ మీఱి ని న్నిట్లు, గలంచిన కైలాట కానిఁ గుమారుఁ
డని మదిఁ గనికరం బరయక శిక్ష, యొనరించి నీమదియుడుకెల్లఁ దీర్తు
నాహా జగన్మోహనాంగి యిబ్భంగి, సాహసం బొనరింపఁ జనునె నీ కిపుడు
నాయట్టి భూలోకనాథునిఁ జెంది, తోయజానన యింత దుఃఖింప నేల
రాజువట్టినయింతి రంభయన్మాట, యీజగంబునఁ బెద్ద లెన్నఁగా వినవె
నామహారాజ్యంబు నామణిద్రవ్య, హేమచామరహయానేకపాదికము
లెల్లను నీవె కావే పరికింప, చెల్లుబొ నీయాజ్ఞ చెల్లుటలేదె
ననబోడి నీవు గిన్కనుఁ గీడు బొదవ, నినుఁ బాసి క్షణమైన నే నోర్వఁగలనె
వాఁడు చేసిన ద్రోహవర్తన వాని, పొందియార్చెడుగాక పొగలేల నీకు
వనజాక్షి ననుఁ జూడు వగ పెల్ల వీడు, మని యూరడిలఁబల్కి యపుడె శుద్ధాంత
మున కేఁగి యొకయారమున మేను జేర్చి, మొనయు చింతాభరంబున వ్రేగుచుండె.

అని నిరంతరసద్గుణావాలుపేర, ననవద్యదానవిద్యాలోలుపేర
శమనదుర్గర్వోపశమనునిపేర, గమనీయగోరాజగమనునిపేర
తరుణేందురేఖావతంసునిపేర, నరిదైత్యకులతమోహంసునిపేర
సురవాహినీజటాజూటునిపేర్ల, గురుతరశ్రుతికూటఘాటునిపేర
తపనీయశైలకోదండునిపేరఁ, దపనప్రతాపదోర్దండునిపేర
నగతనూజామనోనాథునిపేర, యుగపదాహృతశత్రుయోధునిపేర
దూరితాఖిలఘోరదురితునిపేర, సారపుణ్యోదయచరితునిపేర
సింధురాజినదివ్యచేలునిపేర, బంధురామరలోకపాలునిపేర
భుజగకులేంద్రవిభూషణుపేర, సుజనచరిత్రతాశోషణుపేరఁ
బ్రతిదినకైలాసభవనునిపేరఁ, నతితరాఖిలజగదవనునిపేరఁ
బురహరుపేర శంభునిపేర భక్త, వరదునిపేర సర్వజ్ఞునిపేరఁ
జిరతరమోక్షలక్ష్మీప్రదుపేరఁ, గరుణాత్ముపేర శంకరుపేర సుగుణ
మహితుఁ డంచితకూచిమంచివంశాబ్ధి, తుహినకాముఁడు బుధస్తుతచరిత్రుండు
ఘనయశోన్వితుఁడు గంగనమంత్రిమౌళి, తనయుఁడు తిమ్మసత్కవి రచియించి
తమినిడ్డ సారంగధరచరిత్రమున, నమరంగ నిది ప్రథమాశ్వాస మయ్యె.

శ్రీరస్తు

సారంగధరచరిత్రము

ద్వితీయాశ్వాసము

శ్రీకర గుణసార చిరశుభాకార, భీకరరిపుదూర పృథుతరోదార
కైలాసనిలయ శంకర మహాదేవ, నీలకంధర యీశ నిఖిలలోకేశ
యవధరింపుము వేడ్క నలరాజ రాజు, దవిలినవంత నంతటఁ గొల్వుకూట
మున కేఁగి మంత్రుల బుధులు దీర్పరుల, జనవరులఁ జుట్టల సంగడికాండ్ర
బనివడి రావించి భావంబులోన, నెనయుసంశయమున నించుకదడవు
చింతించి చెప్పక చెల్లదటంచు, నంతటఁ దనుకుఁ జిత్రాంగి దెల్లమిగఁ
జెప్పిన తెఱఁగెల్లఁ జెప్పి మీ రిప్పు, డిప్పని కెద్ది వా గెఱిఁగింపుఁ డనిన
వారలందఱుఁ దలల్ వంచి మాఱాడ, నేర కబ్బురపాటు నివ్వటిలంగఁ
గనవినరాని దుష్కర్మ మిదెట్టు, లనిన దోసము చెందుననుచు నొండొరుల
ముఖములు గనుఁగొంచు మొగి బహిర్దేశ, లిఖితచిత్రాకారలీలల నుండి
రందు నయార్ణవుం డనుమంత్రితిలకుఁ, డందఱు వినంగ నిట్టనియె రాజునకు.

అవనీశ యిట్టిఘోరమగు పాతకంబు, దవిలి వాక్రువ్వను దలపంగఁ గూడ
దేజాతులందు ముందేకథలందు, నేజగంబునఁ జూడ నిట్టి దుర్వృత్తి
పరువడి దననీటు పచరింపులోన, ...
దలఁచిన దొలుతటి తప్పొనొకాదొ, జలజాక్షి యూరకే సవతి యీరసముఁ
గైకొని చంపింపఁ గల్లలు గూర్చెఁ, గాక యిమ్మాట నిక్కంబే యటన్న
గలికిచే నదియెల్ల గట్టిగా మీరు, దెలుసుకొన్నదిగాదె తేటతెల్లమిగ
తులువలౌదురుగదా దొరబిడ్డ నెందుఁ, బలుకు లేమిటి కింకఁ బనిదప్పె జుమ్ము
పండెనీసిరి చేటువాటిలెఁ గొలలు, నిండె నింటఁ గులంబు నీరు రావలసె
తలకొనె నపకీర్తి తప్పె ధర్మంబు, తలవంపులయ్యె నందఱిలోనఁ జాల
చులుకనై తోఁచె నిచ్చో దొరతనము, పలచనయ్యెను వాసి ప్రజ్ఞ లడంగెఁ
గావున గొదుగక కనికరపడక, భూవర పినతల్లిఁ బొదవిన ఖలునిఁ
గొడుకింతయును లేక ఘోరవ్రణంబుఁ, గదిసిన యంగభాగంబును బోలె
ఖండించి తేజంబుఁగను మిట్లుగాక, దండించి పోఁదోలఁదలఁచితివేని
కడుజబ్బు పడుఁజుమ్ము కార్యంబు లెల్ల, నిడుమ లంతంతకు నెడపక పొడవు
ననవిని మతిమంతుఁ డనుమంత్రితిలకుఁ డనుపమనయశాలి యప్పు డి ట్లనియె.

జననాథ యిది శాస్త్రసమ్మతి గాదు, ధనము బోయిన మనస్తాపం బొదవిన
దనయింటఁ గానివర్తన మొకటైన, ఘనులకు వెలిసేయఁగాదండ్రు బుధులు
పినతల్లు లిండ్లకుఁ బృథివి నెందైనఁ, జనవునఁ గొడుకులు చను టేమితప్పు
తమతప్పు మగవారితలఁ బెట్టి దుండ, గమున బొంకులు పల్కి కారింపఁజూతు
రతివల డెందంబు లరసి కన్గొనఁగ, క్షితిలోన నేరికిఁ జెల్లదు సుమ్ము
మది నుంచు టొక్కటి మరి యాడు టొకటి, కదిపి యొనర్చు టొక్కటి తొయ్యలులకు
కపటంబె కాని నిక్కం బింతలేదు, చపలనేత్రల నమ్మఁజనదు నృపాల
తనయుని నైన సోదరునైన మఱియు, జనకుని నైన ... ...
తిలకించి చూచుచోఁ దెఱవలకెల్ల, జిలజిల మరునిల్లు ... ...
హరితోడ ద్రౌపది యాడదా మున్ను, పరికింపనటులె యిప్పడఁతియు నతని
గొనలు గన్గొని పొందుఁగోరిన నియ్య, కొనక వచ్చుటఁ జేసి కొఱకొఱపూనె

ఖండింపఁదలఁచి యీకల్ల పుట్టించె, నొండెద్దియును గాదహో వివరింప
నొండుగొండె మెఱుంగ కుందడుగోల, బండుసేయదలంచె పడఁతి యిట్లాడె.

నింతయెకాని య దింతియెకాని, వింత యింతయు లేదు వినువానివలన
సారంగధరకృపాసంజ్ఞాతుఁడైన, సారంగధరుఁ డిట్టిజాడలనాఁడె
వెలఁది బొంకుట గోడ వేసినయిట్లు, ... మగబొంకు దడి గట్టినట్లు
ననుమాట మును పెద్ద లాడంగ వినమె, తనయునివలన నేతప్పును లేదు
వనితమాటలు వినినలపాఱఁ గన్న, తనయునిఁ జంపింపఁదలఁచెద వేని
కైకమాటకు రాముఁ గానల కనిచి, శోకార్తిచేఁ జాలస్రుక్కిన పంక్తి
రథునితెఱంగున రాజేంద్ర నీవు, పృథుశోకములపాల భీతిలెదుసుమ్ము
వానిని పెద్దలందఱు మతిమంతు, నావినీతికి మెచ్చి యవునవు ననిరి
కార్యనిశ్చయబుద్ధి గలుఁగక భూప, వర్యుఁ డూరకె తలవంచుకయున్న
నారసికాగ్రణి యనుమానసరణి, యారసి నీతిజ్ఞుఁ డనుమంత్రి పలికె
మనుజువల్లభ మతిమంతుని బుద్ధి, వినఁదగుఁగాని ... యేల వలదు
ననబోఁడిమాటలు నమ్మిక చేసి, తనయుని వధియింప ధర్మంబుగాదు
తగువారిఁ బనిచి యాతని నడిగింపు, మగపడుఁ దద్విధంబంతయు నపుడు
మాటలవరుసవెంబడినె కర్జంబు, తేటతెల్లంబుఁగాఁ దెలియంగవచ్చు
దుడుకు చేసితివేని దోసంబు దొరలు, చెడుఁబ్రయోజన మెల్ల సిద్ధంబుసుమ్ము
నావుఁడు వసుమతీనాయకుఁ డటులె, వేవేఁగఁ దద్దయు వెరవరులైన
ప్రెగడలఁ బనిచిన బిఱబిఱ వారు, జగతీవరాత్మజు సమ్ముఖంబునకుఁ
జనిన వాతఁడు గుండెఝల్లని వారిఁ, గనుఁగొని యడలుచు గద్గదకంఠుఁ
డై పల్కె నిపుడు మీరందఱు నిచటి, కేపని యెదల నూహించి వచ్చితిరి
తెలియఁజెప్పుడటన్న దిగ్గునవారు, పలికి రిట్లు పాణిపద్మముల్ మొగిచి
నరనాథతనయ నిన్న విభుఁడు వేట, కరిగినచో నీవు హోళిఁ జిత్రాంగి
లోగిలిఁ జొచ్చి యాలోలాక్షి హొయల, లోగివరాసక్తి లోగిలి గొనఁగ
నణిముణికేలికి నర్థించుటయును, తెఱవ యించుకయైనఁ దెఱవిడకున్న
సారసశరశరాసారసంఘాత, భూరివ్యథాపరాభూతుఁడ నగుచు
బలిమి కౌఁగిటఁ బట్టి బాములఁ బెట్టి, తొలఁగి వచ్చితటంచుఁ దొయ్యలి దొరకు
వెఱగుమీఱఁగ విన్నవించిన నతఁడు, కొఱకొఱతోడ నిన్నొడుకని యనక
సమయింపఁబూని నిజంబుఁ గల్లయును గ్రమ మొప్ప ని న్నడుగఁ బంచె సుమ్ము
కలచంద మెల్ల నిక్కంబుగ మాకు, దెలియఁజెప్పుమటన్న ధృతిచెడి యోన
మశ్శివాయ చలంబు మానక యెంత, దుశ్శీలమున కింతి దొరకొనెనంచు
శృతియుగళంబు మూసికొనియె కొమరుఁ, డతిమృదూక్తుల నిట్టు లనియె వారలకు.

వినుఁ డయ్యలార నావిన్నపం బిపుడు, జనపతి వేటకుఁ జన్నపిమ్మటను
నాతోడిరాజనందను లెందఱొచ్చి, ప్రీతినాటలకునై పిలిచిన నరిగి
బారావతంబులఁ బందెంబు నరసి, తారాపథమునకుఁ దమకంబుతోడ
నెగయ వైచిన దద్ద యేపున నేఁగి, మగుడక నాచేతి మతకరిపులుగు
చిత్రాంగి నగరుఁ జొచ్చిన నప్పయోజ, పత్రాక్షి యాపుల్గుఁ బట్టి దాచుటయు
పినతల్లి యని మదిఁ బెద్దయు నమ్మి, చనువున నచటికిఁ జనిన నయ్యమ్మ
వలపాఱ ననుఁ జూచి వలరాచపనికిఁ, బిలిచినఁ గాదని పెనఁగివచ్చుటయు
నాతప్పు నీమీఁద నట్టొనరించి, జేతులుఁ గాళ్ళును జెలపింతుననుచు
కినుకతోఁ బలికిన గిజగిజలాడు, కొనుచు నింటికి వచ్చి కొంకుచు నుంటి
తల్లి నాపై నట్టి తప్పిడినపుడు, చెల్లించి విభుఁ డది చెవిఁ బెట్టినపుడు
నే నెఱుంగనటంచు నేమముల్ నలుక, మానిపోవునె రిత్తమాట లేమిటికి
తెఱవమాటలకు ధాత్రీవిభుఁ డలిగి, యరుగఁబంచిన నేమి యనఁగలవాఁడ
భూతలేశ్వరుఁడ నన్ బ్రోచు దైవంబు, మాతల్లిరత్నాంగిమారు చిత్రాంగి
యని డెందమున ననయంబు భావింతు, వినుఁ డిందులకుఁ బురద్వేషియె సాక్షి
జగతీతలం బెల్ల శాసించురాజు, తగవు దప్పక ధర్మతత్పరుం డగుచు

తిర మొప్ప దేవభూదేవతాగ్రమునఁ, బరిశోధనము చేసి పట్టి గట్టిగను
తప్పుగల్గినిచోట దండించుమనుడు, తప్పక శుభములు దలకొనుననుడు
దిటముగా మఱల నత్తెఱవనె యడిగి, పటుగతి నిజమెల్లఁ బరికింపమనుడు
పొండు మీరని వస్త్రభూషణావళులు, దిండుగా నొసఁగి పుత్తెంచిన వారు
ధరణీశుకడ కేగి తమకు సారంగ, ధరుఁడు జెప్పినరీతి తప్పకఁ జెప్పి
యధిప కుమారునం దరమరదలఁచి, వధియింపఁగూడ దవ్వనితనే మఱల
గట్టిగా బెదరించి కల్లయు నిజముఁ, బట్టఁబోలునటన్న పార్థివేశ్వరుఁడు
మంచిది మీ రన్నమాట చొప్పుననె, కొంచక మఱియు నక్కోమలిఁ దెలుసు
కొందము రండని గొబ్బున వారి, నంద ఱెదుర్కొని యట కేఁగుటయును
కనుఁగొని చిత్రాంగి గద్దియ డిగ్గి, కనుదోయికొనల వెక్కసముగఁ జాలు
కొను వేడికన్నీరు గోళ్ల మీటుచును, తనువు వణంక ముగ్ధయుఁబోలె మేలి
ముసుఁగు చక్కఁగఁ దాల్చి, మో మరవంచి, పసిఁడికంబమునీడ బాగుగ నిలిచి
యున్నఁ గన్గొని పెద్ద లుమ్మడినప్పు, డన్నీలవేణి కిట్లని వచియించి
రమ్మరొ నిన్న మీయండకుఁ బారు, వమ్మునెపంబున వచ్చి సోయగము
దైవార సారంగధరుఁడు కామార్తి, ...
... ... జేయ వే మిమునంటి చెయివట్టి దుండ
గము చేసి నీరాజుగారితో మీర, లమితాగ్రహస్ఫూర్తి నాడితి రనుచు
కినుకతోఁ బతి వానిక్రేవకు మమ్ముఁ, బనిచిన నేఁగి యేర్పాటుగాఁ దెలసి
వచ్చితిమనుచుఁ దద్వాక్యముల్ పూస, గ్రుచ్చినరీతి నక్కొమ్మకుఁ దెలిపి
వనిత యక్కొమరునివలన దోసంబుఁ, గనుఁగొన నింతయుఁ గనరాదు నీవు
నిజముగా విప్రసన్నిధి నున్ననూట, గజిబిజి సేయక గట్టిగాఁ బల్కు
దబ్బరలాడిన దైవంబు నిన్ను, గొబ్బున నిడుమలఁ గుడిపింపుఁ జుమ్ము
కొమరునిపై నట్టిగొడవలు బెట్టి, సమయింపఁదలఁచుట చనదు ...
... యతో ధర్మ స్తతో జయం బనియు; తలఁచిచూడఁగ నానృతాత్పాతకంప
రమ్మనియునుఁ బల్కుక్రమములు వినవె, కొమ్మరో నీవు గన్గొనని శాస్త్రములుఁ
గలవెయటన్న నక్కలికి లోనులికి, యలుక మీరఁగ వసంతాగమారంభ
లలితరసాలపల్లవరసాస్వాదన, కలనాకషాయితకంఠసోత్కంఠ
కలకంఠకులవధూకాకలిధ్వనులు, నెలుగెత్తి యేడ్చుచు నృపున కిట్లనియె.

ఓరాజు నన్నింత యుడికింపనేల, గారాబుకొమరునిఁ గాదనలేక
యూరెల్లఁ గూర్చి యయో రట్టు సేయ, మేరయె వంతల మిడికెడుదాని
తలవంపులయ్యె నందఱిలోను సిగ్గు, దొలఁగె మానంబెల్ల ధూళినడంగె
మానహీనంబైన మానిని బ్రతుకు, మానవేశ్వర యంతమాత్ర మూహింపు
చెల్లంబొ నేడు నాచెంత నీకింత, యెల్లిదమై తోఁచె యిటులఁ బల్మారు
కతకు కాళ్లను మఱి కడవకుఁ జెవులు, నతకఁజూచెద వింక నిందఱిలోన
గన్నులు చల్లఁగాఁ గనుఁగొను మిప్పుడు, పన్నుగా మఱియొక్కపాలి యటంచు
గయ్యాన కరిమురిఁ గాలు ద్రవ్వుచును, గయ్యాళి పయ్యెదఁ గడకొత్తివైచి
పులినీళ్లు గ్రమ్మెడు పొగడు సిబ్బెంపు, వలిగుబ్బగవమీఁది వ్రయ్యలు జూపె
చూపిన దలలు వంచుకొని యందఱును, హాపరమేశ్వరా యంచు నున్నంత
నిదియును దబ్బరయే చూడుడంచు, ముదిత దుప్పటిఁ దెచ్చి ముందఱఁ బెట్టి
యరయంగ నివ్వల్వ యతనిదొ నాదొ, వెఱవొప్ప మీరెల్ల వివరించి చెప్పు
డనుటయు నిఁక సంశయం బేల రండు, పనిలేదు తడయ నిప్పనికని నృపుఁడు
గొబ్బున నారిఁ దోడ్కొని సభ కేఁగి, ప్రబ్బెడు కినుకతోఁ బ్రాజ్ఞుల నెల్లఁ
బిలిపించి బలిమిమై పినతల్లిఁ గవయు, బలుకి నేక్రియ శాస్తి గావింపవలయుఁ
దెలియఁ బల్కుఁడటన్న ధీమంతులెల్లఁ, బలికి రెట్లని మహీపతి యిట్టితులువఁ
బట్టి నట్టడవిలోపల మొఱయిడఁగఁ, గట్టి చేతులుకాళ్లు ఖండింపవలయు
నని విన్నవించిన నట్లె కావింపుఁ, డని యారెకులఁ బిల్చి యానతి యొసఁగి
భూమివల్లభుఁ డంతిపురము సొత్తెంచి, వేమఱు దొసఁగుల వ్రేఁగుచునుండె.

ఆయెడ ద్రోహురాలైన జిత్రాంగిఁ, బాయక కన్గొన్నపాపంబు దొలఁగ
స్నానం బొనర్పఁ గ్రన్నన నేఁగె ననఁగఁ, బూని పశ్చిమమహాంబుధిఁ గ్రుంగె నినుఁడు
తగవుమాలి కుమారు దండింపఁగోరె, జగతీశుఁ డిది యెంతసాహసం బనుచుఁ
గనవచ్చు ఖేచరాంగనల మేచాయ, లన సంజకెంజాయ లలరారె మింట
కామాంధుఁడై కన్నుఁగానక భోగ, కామినికై పు ఖండింపఁదలఁచె
జననాథు నపకీర్తి జగముల నిండె, ననఁ జీఁకటులు పర్వ నఖిలదిక్కులను
చెలిని గట్టిగ బాస చేయించి నిజము, తెలియకఁ గొమరు బాధింపరాదనుచు
ననిమిషుల్ మినుపెచ్చునం దిడ్డ నిప్పు, తున్కలన రిక్కలు దోఁచె నభ్రమున
తనపేరివాఁడును దనవంశకరుఁడుఁ, దనుబోలు భువనసుందరుడును నైన
సారంగధరుని ద్రుంచఁదలంచె దోస, కారియై నృపుఁడని ఘనతరక్రోధ
రసపూరితాస్యకై రవ దోచె ననఁగ, పొసఁగఁ దూరుపుదెసఁ బొడమె జంద్రుండు
క్రూరతఁ జిత్రాంగి కొడుకుఁ జంపింపఁ, గోరెఁబోబ్రో దనచోటు గోరంత యైన
గన నేర ననుచు నగ్గలముగఁ బేరు, కొని నభోవాణి పక్కున నవ్వె ననఁగ
జిడిపిచానలకెల్లఁ జేటొనఁగూర్చి, గడితమై జగమెల్లఁ గప్పె వెన్నెలలు
తనమాట చెల్లె నిత్తఱి నని యుబ్బి, కనుఁగొని చిత్రాంగికన్నులఁ బోలి
కలువలు దొగలు చెంగలువలు నల్ల, గలువలు వికసించెఁ గమలాకరముల
రూఢిమై దోషాకరుం డగురాజుఁ, జూడరాదని వీఁగుచొప్పునఁ బద్మి
నీసతి వదన మెత్తె మోడ్చుకొనియె, వేసరె చక్రముల్ వెతల బిట్టడలె
నపుడ రేకులు మహోగ్రార్భటుల్ నిగుడ, విపరీతగతి బయల్వెడలి వాటింపు
నడునెత్తిసికలు గీర్ నామముల్ నలువు, ముడివదులె డెందకార్ములు చయొడండ్లు
కురుచద్రుడ్డులు రాగికోరమీసములు, గొరకయాటెలు గండ్రగొడ్డండ్లు వంక
కత్తులు మొలనీలికాసెలు పేప, బెత్తులు నురెలు ముప్పిరితాళ్లు నల్ల
గొంగడులును గల్గి గొర... బఱచి, పొంగుచు నరనాథుపుత్రుతో నగరు
జొచ్చిన వారలఁ జూచి యక్కొమరుఁ, డచ్చెరుపాటూని హాయని సోలి
నిప్పు త్రొక్కినరీతి నింగిపైఁ బడ్డ, చొప్పున వెతల నూర్చుచుఁ దనలోన
కటకట చలపట్టి కట్టడి యగుచుఁ, గుటిలతఁ దల్లి టిగ్గొడవఁ జేర్చుటకు
తండ్రియు నింతైనదయలేక యిట్టి, వేండ్రఁపుఁ బనికెట్లు వీఁగక నిలిచె
తగుమంత్రులును నీకుఁ దగ దిది యనక, పగవారివలె జూడ బాల్పడి రహహ
ధర్మమించుకయైన ధరణిపై లేక, నిర్మూలమగుట గాన్పించె నట్లైన
మోసంబుఁ జెందక ముందుముందుగను, వాసి యెచ్చటికైనఁ బరతెంచుచుడిఁగి
ప్రాణంబు గలిగిన బలుసాకులైన, పోఁణినేరుకతిని భువి నుండవచ్చు
నను టెటింగియు నే డహహ చేఁ జిక్కి, బొనుపుదూలెడు పిట్టపోలిక నుంటి
పూనినకర్మంబు పొదివి యెందైన, బోనిచ్చునే వెట్టిపోకలు గాక
కర్మంబు ద్రిప్పినకరణి ద్రిమ్మరకఁ, బేర్మితో విధికైన బ్రిదిలిపోఁజనునె
పరికింప నా కిఁక పార్వతీవిభుఁడె, దరిగాక యన్యు లెంతటివార లనుచు
దిటముఁ గైకొనియున్న దివిరి యక్కొమరు, నట చూచి తలవరు లడలుచు డాసి
నతి చేసి రాజునానతి యెఱింగించి, యతనిరత్నోర్మికయానవాల్ చూపి
సిగ పట్టి పెడమర్ల చేతులు దిగిచి, బిగఁగట్టి లేజింకపిల్లను బొదలి
కొని పారుతెంచు కుర్కురములకరణిఁ, గొనిపోయి పురిచెంతఁ గూర్చుండఁబెట్టి
నడురేయి వనిలోన నఱకుద మనుచు, గడఁకతో వలకొని కాచుక యుండి
రవ్వార్త వీనుల నాలించి దద్ద, నెవ్వడి మూర్ఛ మునింగి రత్నాంగి
మెల్లన తెలివొంది మిడుకుచు లేచి, తల్లడంబున గుండె దడదడలాడ
పెదవులు దడుపుచు పెంపెల్లఁ దూలి, నదనారవిందంబు నన్నియ దరుఁగఁ
జాలి డెందములోనఁ జాల పెంపొంద, వాలుఁగన్నుల నీరు వరదలై పాఱ
నడుగులు దడఁబడ హారముల్ వీడ, తొడవులు సడల పెందురుము జీరాడ
గడగడ ననమలేఁగొను వడంక, నుడుఁగక బడిబడి నూర్పులు నిగుడ
హాకుమార మనోభవాంచితాకార, నీ కిట్టిచేడ్పాటు నేడు వాటిలెనె
యన్నుచు నత్యంతశోకాక్రాంత యగుచు, జననాథుపాలికిఁ జని యిట్లులనియె.

ధరణీశ నేడు నాతనయరత్నమును, నిరుపమసౌందర్యనిధిఁ జంప నేల
మేలాలు పచరించు మేలాలు మదిని, గీలించుకొని చెడుగీ లించుకైన
నరయ నేఱక చిక్కి యక్కట పెక్కు, వెరవులవును గొడ్డు వీఁగి కన్నట్టి
కొమరుని నురుపుణ్యగుణపయోనిధిని, విమలాత్మ నురుము గావింపఁ బూనుదురె
పుడమిలో మును దొరల్ భోగకామినుల, నిడుకొన్నవారు లేరే వార లెందుఁ
దొడవులుఁ జీరెలుఁ దొడుకులు నూళ్లు, విడిముడియును గందవీటికాదులును
కడునొసంగిరి గాక కట్టడు లగుచుఁ, గొడుకులఁ బోకార్చుకొనిరె యీరీతి
పురహరువరమునఁ బుట్టినవాఁడు, పరసతీవిముఖుఁడై పరగెడువాఁడు
చెల్లఁబో యితఁ డెట్లు చెనఁటియై సవతి, తల్లితోఁ బెనఁగొనఁదలఁచె డెందమున
పినతల్లులిండ్లకుఁ బృథివి నెందైనఁ, జనువున కొడుకులు చనుట నేరంబె
చూపోపఁజాల కిజ్జూటుకత్తియయె, పాపనిపై వట్టిపాపంబుఁ గట్టె
కామాంధుఁడవుగాన కానక నీవు, ప్రేమవీఁడెదు కన్నబిడ్డనిమీఁద
క్షితిలోనఁ జేతనాచేతనజ్ఞాన, మతికామకుల కెందు నాత్మలోఁ గలదె
తరుణి పెట్టినమందు తలకెక్కి యందు, నిరవుగా నీయొడ లెఱుఁగవు నీవు
పొలఁతిమాటకుఁ బుత్రుఁ బొలయించెదేని, పలుతెఱంగుల శపింపరె నిన్ను జనులు
నిందయుఁ బాపంబు నిజకులాత్యయముఁ, జెందదేటికి సాహసించి యిబ్బంగి
సకలదిగంతరాజద్రాజసంస, దకలంకలీలానిరంతరోల్లసిత
సితకీర్తిచంద్రికాంచితుఁడవై వినఁగ, గతి నొప్పు నీవివేకం బెందు వోయె
వనిత లేఁబదివేలు వత్తురు గాని, తనయుఁడు గల్గు టెంతయు దుర్లభంబు
వలువదిప్పని మహీవర నాదుమనవి, తలఁపున నిడి వేగ తనయుని మనుపు
కాకున్న నొకకొంత కాకు చేయించి, కాఁక మమ్మును ప్రోలు గడపి పుత్తెంచు
కొడుకును నేనును కోడలుం గూడి, పుడమి నెచ్చటనైనఁ బోయి యుండెదము
చాలించు పంతంబు సైరించు తప్పు, చాలు మా కీభూమిసామ్రాజ్యపదవి
యని వేడుకొనిన రత్నాంగిఁ దలంచి, మనుజేశుఁ డేమియు మాఱాడకుండె.

అటులున్నఁ జూచి రత్నాంగి డెందమునఁ, గటకటఁబడి యహా కార్యంబుదప్పె
దిటముగా పిడుగు మొత్తినరీతి నితఁడు, కటికెతనం బూని కదలకున్నాడు
దరి యెవ్వ రింక నిత్తరి నిది మాన్ప, హరహర కఠినాత్ము లధిపతు లెన్న
తనయునినైన సోదరునైన బంధు, జనునైన దనుగన్న జనకునినైన
మానక రాజ్యాభిమానంబు పూని, మానవేశాధముల్ మడియింపుచుంద్రు
భువిలోన రాజ్యాంతమున నఱకంబు, ధ్రువమని స్మృతులు పొందుగఁ బల్కఁగాదె
కాపట్య మధికంబు కనికరం బిల్లె, కోప మెక్కువ శాంతగుణము కొఱంత
చాంచల్య మురవు హింసాబుద్ధి ఘనము, వంచకత్వము పెల్లు వర్తనల్ సున్న
చలము దట్టము సత్యశౌచముల్ కల్ల, నిలుకడ నాస్తి దుర్నీతి గాటంబు
పరధనాపేక్ష నిబ్బరము ఛీ యిట్టి, ధరణీశ్వరుల కేటి ధర్మమార్గములు
కొడుకు నెట్లును బ్రోచుకొనుటకై యెగ్గు, పడక చిత్రాంగినె ప్రార్థించు టొప్పు
కార్యార్థినః కుతో గర్వ మటంచు, నార్యులు దఱుచుగా నందురుగాదె
యనుచు సయ్యన నగ్గయాళిపాలిటికిఁ, జని వినయంబు మించఁగ నోలిఁ బలికె
సఖియరో చిత్రాంగి సారంగధరుఁడు, ప్రకటింప నీముద్దుపట్టియ కాదె
పాపనిపై యింతపంతంబుఁ బట్టి, కోపించి దండింపఁగూడునె నీకు
తనయు లొక్కొకవేళ తప్పు చేసినను, కినిసి తల్లులు వారిఁ గెడపఁబూనుదురె
పినతల్లి వేదనోపినతల్లి ననుచుఁ, జనవున నతఁడు నీసమ్ముఖమ్మునకు
బొడఁ గనవచ్చిన బూమెలు పన్ని, కడురిత్త దొసఁగులు గట్ట నాయంబె
తలఁపంగ నొకమహీధవు చెట్టఁబట్టి, నెలఁత నీ వొకటియు నే నొక్కటియునె
సవతిబిడ్డను బట్టి చంపించె ననుచు, భువనంబులో నింద బొందుట మేలె
హంసగామిని లెస్స యాత్మఁ జింతించు, హింసకన్నను బాప మెందును గల్గ
దీరసం బెదలోన నిడక యివ్వేళ, గారాపుకొమరునిఁ గాచి రక్షించు
మని వేడుకొన నది యాకులతాడి, యనుపున మ్రోఁగుచు నాపె కి ట్లనియె.

సరిసరి యోబళా చాలుచాల్ మేలు, దొరసాని నని నిటుదొరలఁ బల్కెదవు
రాచబిడ్డఁడ ననుచు రమణి నీతనయుఁ, డెంచి తా మగనాళ్ల యిండ్లెల్ల దూరి
క్రొవ్వున బలిమిఁ గైకొని సిగ్గుకొన్న, నవ్వుచు గొదికి మిన్నక యుండవలెనె
కొమరుండు దెరువాట్లు గొట్టుచునున్న, దమితోడ జనకుండు తగవులు చెప్పు
నన్నట్లు తనయుని యాగడాల్ గ్రమ్మి, తిన్నఁగా చక్కట్లు దిద్దఁజూచెదవు
సింగారములకుప్ప చెలియ నీకొడుకు, నంగనాచి యటన్న నవ్వరె జనులు
క్రమ మొప్ప నొరులనేరము లెంత్రు గాని, తమతప్పు లెంతురె ధర నెవ్వరైన
ననుపమగుణశాలి ననుకొనుగాని, కన వెంగలియును వెంగళి ననుకొనునె
జగదుండగీ డనజాలు తనూజుఁ, దగదని యనలేక తర మెడదొరుల
పొలఁతిరో తమచల్లు పులిచల్ల యనుచుఁ, బలుకుదురే యెట్టిపామరు లైన
పాపని దునుముట పాప మం చనెదు, కోపున దల్లిఁ బైకొనుట ధర్మంబె
కొడుకునేరము లెన్నుకొనక నీ వహహ, యడఁకువ మాలి న న్నాడవచ్చెదవు
పోపొమ్ము కొఱగానిపోకలు మారి, నీపెద్దతనమెల్ల నేఁ డగపడియె
ననియదల్చుచు తూలనాడిన మిగుల, బొనుపరి వెలవెలబోవుచుఁ గదుపు
దరికొని రగల తత్తరుపా టెసంగఁ, బురపురఁ బొక్కుచుఁ బోడిమి డీలు
పడ నావదాగిన పసరంబుమాడ్కి, నడలుచు నొడలు డయ్యఁగ మిన్ను విఱిగి
మీఁదఁ బడ్డటుల నేమియుఁ దోఁచ కచటఁ, గాదని తొలఁగి యక్కమలాయతాక్షి
పరిచారికలు వెంట బలసి యేతేర, సరగునఁ గొడుకున్న చక్కటి కేఁగి
చిగురుటాకులఁ బోలు చేయిని మఱల, మొగిముందలయును మోమును మోదుకొనుచు
ముంగురుల్ చెదరి నెమ్మొగమెల్లఁ గప్ప, రంగైన రత్నహారములు చిందాడు
గనుఁగవబాష్పముల్ కాల్వలై పొరలఁ, దనయుని బొదవి తద్దయు జాలి మీర
కోరి యామనిగండుగోయిల గొల్చు, తీరున నెలుఁగెత్తి తెగి యేడ్వదొడఁగె
హా కుమార జగన్నుతామలాకర, శ్రీకరగుణసార సింధుగంభీర
నలినబాంధవతేజ నవ్యమనోజ, చలితశత్రుసమాజ సతతనిర్వ్యాజ
జలరుహదళనేత్ర జననుతిపాత్ర, విలసితచారిత్ర విబుధేంద్రమిత్ర
భూరిబలోద్దామ భూపలలామ, సారయశస్తోమ జగదభిరామ
లోకసంస్తుత్యశీలుఁడ వనఁదగిన, నీ కిట్టి పెనువంత నేఁడు వాటిలెనె
మునుకొని పెక్కునోములు నోమి నోమి, పొనుపార నెల్లవేల్పులఁ గొల్చి కొల్చి
నెలలు తొమ్మిదియును నిండార మోచి, కులదీపకుఁడవని కోరికన్నట్టి
పుత్త్రరత్నమ పెనుభూతమైనట్టి, చిత్రాంగి కిపు డెఱఁజేసితి నిన్ను
నాముద్దుకుఱ్ఱఁడ ననుఁగన్నతండ్రి, నీమోముఁ గనలేక నే నెటు లోర్తు
కడలేని పుత్త్రశోకపయోధి నెట్లు, గడతు నెవ్వరు దిక్కు గల రిఁక నాకు
తండ్రి యియ్యార్తిఁ గుందఁగ ముం దదేమొ, చండ్రనిప్పుల పూజ సలిపితి గాక
దైవంబు నిన్నింత తప్పు నీక్షించి, నీవంటికొమరుని నేఁడు వోవిడునె
తలఁచిన వారియొద్దనె యుండుననుచుఁ, గులుకుచు బుధులు పల్కుదు రింతె గాక
చెల్లంబొ కటకట శివుఁడును నేఁడు, కల్లరియై నిన్ను గావలేడయ్యె
బాపురే దైవంబు పాపకర్ములకు, దాపగు ననుమాట తథ్యమై తోఁచె
సత్యంబు పదడయ్యె సమసె ధర్మంబు, నిత్య మయ్యెను కల్ల నిలిచె పాపంబు
దైవంబు గురి దప్పె తప్పె కర్జంబు, భూవల్లభునిబుద్ధి పూరి మెసంగె
మును నోమినట్టి నోములబలం బిట్టు, లనుభవింపఁగ నయ్యె నయ్యయో దీని
కేమి సేయుదు నింక నెవ్వరినందు, నేమిఁట యివ్వెత యెడఁ బాపుకొందు
కొడుకు నాకంటె నెక్కుడుగఁ జిత్రాంగి, కడ మాతృభావంబుగా నెన్నుకొనక
దుడుకు చేసితివి తుందుడుకయ్యె నీతి, యెడలని నీబుద్ధి యెక్కడబోయె
పరధనపరవధూపరమనస్కులకు, పరికింప నిహమును బరమును గలదె
యని విలపించుచు యవనిపైఁ బొరలు, కొనుచు పెంధూళి బ్రుంగుచు దూపగొనుచు
సొమ్మవోవుచుఁ దేరిచూచుచు లేచి, యుమ్మలింపుచు వెచ్చ నూర్చుచునున్న
జనని నూరార్చుచు సారంగధరుఁడు, వినయంబు దైవార వెస నిట్టు లనియె.

అమ్మరో చిత్రాంగి నరయక ప్రత్య, హమ్ము నీమారుగా నాత్మలోఁ దలఁతు
నయ్యామననుఁ జూచి యతిమనోజార్తి, నయ్యామ్మ యనుచు డాయఁగ రాఁగ బెనఁగి
కాదని వచ్చిన గాకచే నులికి, మేదినీశ్వరున కేమియొ విన్నవింప
నోజమాలిన రాజయో తునిమింపఁ, గాఁ జూచి పెద్దలు గాదనరైరి
యింతియకాని మఱేమియు నెఱుఁగ, నంతకంతకుఁడె తథ్యం బొప్ప నెఱుఁగు
నిలఁ బురాకృతకర్మ మిటువలెఁ గుడువ, వలసెఁబో దీనికి వగవ నేమిటికి
పాయని సుతశోకపారవశ్యమున, నాయమ్మ నీవుండ నాయమ్మటంచు
నిలువాసి సభకురా నెట్లు నొసంగు, వలువ దూరకపొమ్ము వంతను వీడు
నాయనుంగులనెల్ల నాయట్ల చూడు, మేయెడ పతిభక్తి యెడలకయుండు
చిత్రాంగిపైఁ గిన్క సేయకు మిగుల, మైత్రి వాటింపు మేమరకు ధర్మంబు
నృపతిఁ బోనాడకు నీతిపోవిడకు, మెపుడు నాకైకస్తి యెదలోన నిడకు
మనుచు కేల్గవ మోడ్చి యడుగుల కొరిగి, కనుదోయి నశ్రులు గ్రమ్మబల్కుటయు
హాయని ... ... పాయని వెతలఁ బాల్పడిలేచి కొడుకు
గ్రుచ్చి కవుంగిటఁ గూర్చి దీవించి, వెచ్చనూర్చుచు బాష్పవిహ్వల యగుచు
చెక్కులు ముద్దాడి శిరము మూర్కొనుచు, నక్కుమారుఁ దలార్ల కప్పనజేసి
తొలఁగిపోవుచుఁ గాల్లు తొట్రుపడంగ, నిలిచి చూచుచుఁ దూలి నేల వ్రాలుచును
క్రేపుం ... ..., భూపరియడలు ... యడంగి
యెట్టకేల కనూనయించి చేడియలు, పట్టియీడ్చుకపోవఁ బడఁతియల్ చేరి
కొడుకువైఖరు లెన్నుకొనుచు శోకాబ్ధి, నెడపక మునుఁగుచు నీదుచు నుండె
నగరరక్షకు లంత నడురేయియైన, దగకుమారుకు బంధముల వదల్చి
చెదరినకురులు వాసిగ సిగవైచి, కుదురుగా మొగలిరేకులు నిండదురిమి
నొసల కస్తురిబొట్టు నునుపారఁ బెట్టి, కొసరు వెట్టక మేనఁ గుంకుమం బలఁది
యలరుసంపఁగెదండ యరుతఁ గీలించి, పొలుపారు తొడవు లొప్పుగ బొందుపఱచి
క్రొవ్వాడికత్తు లొక్కట త్రిప్పుకొనుచు, క్రొవ్వార నతనిఁ దోడ్కొని యట తరలి
వటపటీరరసాలవానీరసాల, పటకుటజాంకోలపనసతక్కోల
తాలతూలతమాలతతకృతమాల, మాలతీకురవకామలకహింతాల
మాలూరపురపిచుమందమందార, గాలవారలకర్ణికారభండీర
నారికేళాశోకనాగపున్నాగ, నారగలుంగచందనకుందపూగ
జంబూకదంబకాశ్వత్థకపిత్థ, జంబీరపాటలిచంపకాచ్చోట
కరవీరకేతకీకదళీలవంగ, సరలకీచకముఖక్ష్మారుహాన్వితము
శరభసైరిభఖడ్గశల్యభల్లూక, కరిశశగంధర్వగండభేరుండ
రురుకురంగసృగాలరోతకవ్యాఘ్ర, హరిణగోలాంగూలహర్యక్షగవయ
సృమరశంబరకోకచీనగోకర్ణ, చమరరోహిషతరక్షస్తబ్ధరోమ
రామభుజంగమార్జారాదినిఖిల, భీమవన్యమృగేంద్రబృందసంకులము
క్రకరధార్వాఘాటకంకధూమ్రాట, బకచకోరకకోకపరభృతోలూక
కాకగ్రుధ్రమయూరకలరవకీర, కాకోలహరితగరుడకపోత
కుకుభభరద్వాజకుక్కుటసారంగ, కృకవాకుటిట్టిభకృజ్మరాళాది
వివిధగరుద్రథవిసరవిచిత్ర, రవనిగంతరసమాక్రాంతంబు నగుచు
దగుమహారణ్యమధ్యము జొచ్చి యచట, జిగిమించు నొకవధ్యశిలమీఁద నతని
నిలిపి మేతొడవులన్నియు దీసి యింక, దలఁపుము నీయిష్టదైవంబు నంచుఁ
బలికి ఖండింపనోపక కొంకుచున్న, తలవర్ల కాభూపతనయుండు పల్కె
వినుఁ డన్నలార యివ్విధిఁ గొంక నేల, మనుజవల్లభుపంపు మఱలింపఁ దరమె
మీరు నాకును నేను మీకును దప్పి, నారముగా మొ... ... డైనఁగాని
నళినగర్భుఁడు మున్ను నాలలాటమున, వలనుగా వ్రాసినవ్రాత యిట్లుండె
మీ రేమి సేతు రిమ్మెయి దైవఘటన, యీరీతి నగుట కిం కేల చింతింప
తలంపుము యిష్టదైవంబు నంచు, బలికితి రహహా యిప్పగిది జంపింప
తల్లిదండ్రులె పూని తమిఁ బంపునపుడు, చెల్లంబొ వారలఁ జింతింపనేల
ధర్మంబు ... ..., ధర్మదేవత నింక దలఁప నేమిటికి

యెల్లవిధంబుల నియ్యెడ నాకు, తల్లియు దండ్రియు ధర్మదేవతయు
దైవంబు గురుఁడు బాంధవుఁడు మిత్రుండు, కావ బ్రోవంగ ... ...
యని విహాయసకేశు నఖిలలోకేశు, వినిహతకీనాశు వృజినవినాశు
గౌరీమనోనాథు గంగాసనాథు, సారయశస్సాధు సాధితాసాధు
యతిమనోబ్జవిహారు నహిరాజహారు, వితతమహోదారు విబుధమందారు
... ... వాసు నిత్యవిలాసు, కలితగుణావాసు కరిచర్మవాసు
విమలధర్మనికాము వినమితకాము, సముదశత్రువిరాము జగదభిరాము
సదమలసల్లాపు చంద్రకలాపు, విదళితభవతాపు విదితప్రతాపు
కరధృతసారంగు కరుణాంతరంగు, సరససద్గుణసంగు జలధినిషంగు
ఘను మహాదేవు శంకరు భక్తసులభు, దనమదిలో నిల్పి తలఁపుచునుండె
నపు డారెకులు కత్తు లనువొప్ప నూరి, కృపలేక ... ...
కరచరణంబులు ఖండించివైవ, హరహర పరమేశ యంచు నతండు
బిగిచెడి కీలుదప్పిన పైఁడిబొమ్మ, పగిది దబ్బున నేలఁబడి సొమ్మఁగొనియె
తలవరు లతనిచందంబెల్ల నిలిచి, తెలిసిపోవుదమంచుఁ దివిరి ... ...
... ... జేరి పొంచియున్నంతఁ, బదపడి యారాచపట్టి వే తెలిసి
కనువిచ్చి నలుగడల్ గనుఁగొని భీతి, పెనఁగొన డెందంబు పెల్లవియంగ
నెత్తురువరదలు నెమ్మెయి గుమ్మి, ... తెఱంగు చొప్పడఁజేయ
నిల బొమ్మరిలఁబడి యేడ్చుచు నొడలి, సలుపున నడలుచు జడిగొను తొరుగు
కన్నీరు సోనల కాల్వలై పొరల, మన్నున వ్రాలి వేమఱుఁ బొరల్కొనుచు
దైవంబు దూరుచు తల్లడింపుచును, జీవంబు లూడంగ శివశివా యనుచు
సొమ్మవోవుచు దేరిచూచుచు దూరె, యుమ్మలింపుచుఁ దద్ద యుసురుసు రనుచు
హా తాత హా మాత హా జగన్నేత, యేతెఱంగున నోర్తు నీయార్తి ననుచుఁ
దలవరులార వంతల కోర్వఁజాల, తలయు గొబ్బున వచ్చి తరగరే యనుచు
గారుబెబ్బులులార కడలేనిఢాక, మీరఁ గైకొని వేగ మ్రింగరే యనుచు
బహుయాతనల గాసి బడఁజాల నింక, గహనానలను తూరి కాల్పవే యనుచు
చిత్రాంగి హా యెంత చేసితే యనుచు, ధాత్రీశుఁ డెంతనిర్దయుఁ డయ్యె ననుచు
తరులార గిరులార తాపసులార, కరులాగ హరులార గంధర్వులార
నరులార సురలార నాగేంద్రులార, కరుణ మీరఁగ ననుఁ గావరే యనుచు
ప్రెగడబిడ్డనిమాట భీరువోవిడుట, కగపడెఁబో ఫలం బని యెన్నుకొనుచు
దుండగంబున నేఁటిఁ దొలుబామునందు, ఖండించినాడనో గాక యీఘోర
దురవస్థ నేడు చెందునె దీనికింకఁ, బరుల నాడఁగ నేమిపని యనుకొంచు
మశకపిప్పిలికామాక్షికాక్రిములు, పిశితేచ్ఛఁ బొదవిన బిట్టుగాసిలుచు
మృగఖగనివహముల్ మెలఁగెడి చడులు, దగిలి యాలించి యంతయ దిగుల్ గొనుచు
కరపదహీనుఁడై కడుబహుళార్తి, ధరగుందు సారంగధరుఁడును బోలె
కరపదహీనుఁడై కడుబహుళార్తి, ధరగుందు సారంగధరున కవ్వేళ
ఘనతరవర్షాభ్రగర్జాగభీర, నినదయై యశరీరి నెమ్మి నిట్లనియె.

నృపపుత్ర యివ్విధి నేటికి వగవ, నిపుడు దొల్లిఁటిపాపమెల్ల భువితప్ప
కేటికీదీరు తద్వృత్తాంత మెల్ల, తేటతెల్లంబుగఁ దెలిపెద వినుము
భువిని గోళాంబయన్ బురవరం బేలు, ధవళచంద్రుండను ధరణీతలేశుఁ
డనఘుఁ డాతనికి జయంత సుమంతు, లనెడు ప్రగ్గడలిర్వు రలరొందుచుందు
రందు సుమంతునం దఖిలభారంబుఁ, జెందించి పతి దయసేయుచున్నంత
నోర్వలేక జయంతుఁ డొకనాఁడు మిగుల, దుర్వృత్తి నలసుమంతునిఁ జంపఁదలంచి
భువనసుందరియను భూపతిభోగ, కువలయేక్షణ దాసిఁ గూర్చి సుమంతు
పావ లాభోగింపపట్టెమంచంబు, క్రేవ బెట్టించిన నృపతి యాలేమ
యింటికిఁ జని పాను పెక్కి మోహంబు, దంటమాటలఁ గొంతతడవు గ్రీడించి
యొరగి తమ్ముల మర్వి నుమియంగఁ బోయి, దరినున్న పావలు తటుకునఁ జూచి
యరుదంది యివి యేరివని యడుగుటయును, దరుణి యంతయు భీతిఁ దలిమంబు డిగ్గి

నిలుచుండి యడుగుల నేలవ్రాయుచును, దలవంచుకొనియున్న ధరణీశుఁ డపుడె
కొలువున కరుదించి గొబ్బున పాదు, ... యంగ నచటి
నెఱవాడులను జూచి నెరవుఁగా మీఱ, లెఱిఁగింపుఁ డీపావ లెవ్వరి వనిన
తలలు వంచుకొని యందఱు నూఱకొన్నఁ, దలవరియొకఁడు మంతనమున నత్తె
ఱంగెల్లఁ దెలిపిన రవరవల్ నిగుడ, చెంగటి బుధుల నీక్షించి యవ్విధము
తెలియఁజెప్పి విభుఁడు దీని కేశాస్తి, గలదన్న వారలు కడఁకతో నట్టి
ఖలుని నట్టడవిలోఁ గాళ్లుఁజేతులును, జెలపింపదగునంచుఁ జెప్పిన నటులె
చేయింపఁబనిచి యాచెలువను నూతఁ, ద్రోయించె నట సుమంతుని దలవరులు
కరచరణంబులు ఖండించివైవ, నిరపరాధిని నన్ను నిర్దయ నిట్లు
దునిమింపఁజేసిన తులువ ... ..., తునిమింపఁబడుగాక దొనఁగుల నడలి
యనుచు శాపం బీయ యుతితరవ్యథల, మునిగి యాతఁడు ప్రాణముల వీడుకొనియె.

అలజయంతుఁడవు నీ వాసుమంతుండుఁ, దలఁప రాజమహేంద్రధరణీవల్లభుఁడు
కావున దొంటిదుష్కలుష మీవిప్పు, డీవిధంబున భుజియించితి వింకఁ
జెచ్చెర నీకును సిద్ధపదంబు, విచ్చలవిడి నబ్బు వెఱవకు మనుచుఁ
తెలిపి యప్పుడు ధర్మదేవత చనినఁ, దలఁపున నారాజతనయుఁ డొక్కింత
దిటమూనియుండె నత్తెఱఁగెల్ల రాజ, భటు లాలకించి లోపలుమరు వగచి
కటకట నృపుఁ డింతకట్టడి యగుచు, మటుమాయలాడియు మాటను వట్టి
కల్లనిజంబులు కనుఁగొనలేక, బల్లిదుండగు కన్నపట్టిఁ దృంపించె
భూమిలో రాజ్యవిభూతిమంతులకుఁ, గామాంధులకు వివేకం బెందుఁగలదె
యని యనుకొనుచు గ్రచ్చడ మహావన, మున కేఁగి యొకయారమున నుండి రంత
వనభూమి నటువలెవనరు భూరమణ, తనయుని యార్తనాదం బాలకించి
దరి నొక్కగిరిగుహాంతరమున యోగ, సరణి గ్రీడించు నిశ్చలతపోధనుఁడు
మీననాథుండను మేటిసిద్ధుండు, మానితకారుణ్యమానసుం డగుచు
నిప్పు దీనడురేయి నెవ్వఁడో త్రోవఁ, దప్పిన ట్టడవిలోఁ దలకొనియేడ్చు
చున్న వాఁ డత్తెఱం గొయ్యన తెలిసి, క్రన్నన వత్తముగాకని తలఁచి
పనిచి కెంజిగిసోగ ... ..., దినుసు మీఱఁగఁ దద్ద డిండుగాఁ జుట్టి
నింగినాదపుకొమ్ము ... లాంతంబు, కెంగేల దొరుపులు గిరిగొ ... ...
పలువన్నియల యోగపట్టంబు దాల్చి, మొలను బెబ్బులితోలు మురువుఁగాఁ గట్టి
మేలిక్రొందెలిబూది మేన నలంది, లీల రుద్రాక్షమాలిక లెద నించి
పొడులయొడ్డాణంబు పొసఁగ బిగించి, గడితంపు వెలిపట్టుకంధ పైఁగప్పి
వెడఁదలై కనుపట్టు వీనుల మంచి, కడిఁదిజాబిలి రాల కామాక్షు లునిచి
చెలువంపుకకపాల చేత ధరించి, గిలుకు పావ ... ...
యరుదెంచి రక్తసిక్తాంగుఁడై నేల, శిర మూనుకొని బిట్టుచెట్టు నలిఁగి
తునిగిన కాళ్లు చేతులు గల రాజ, తనయుని నీక్షించి తద్దయు వగచి
చెల్లరే తొగలనెచ్చెలికాని మేన, ... గమున మీరు
నతిసుకుమారు ని ట్లనుకంప లేక, వెతఁబెట్టి రెవరొ యివ్విధి పాతకమున
కొడిఁగట్టుకొని యంచు నొయ్యన వాని, కడకు డగ్గఱఁబోయి కరుణతోఁ బలికె
వ ... ..., గహనోర్వి ... దుఃఖములఁ గుందెదవు
నీ కిట్టిదుర్దశ నే డేల కలిగె, ప్రాకటంబుగ వేఱుపఱుపు మటన్న
తలయెత్తి వాల్గనుతామరల్ విచ్చి, నలుదిక్కులుం జూచి నరనాథసుతుఁడు
తనమ్రోలఁ గనుపట్టు తాపసప్రవరు, ఘనతేజుఁ జంద్రశేఖరనిభమూర్తిఁ
బెన్నిధానముఁగన్న బేదయువోలె, కన్నులపండువుగాఁ బొడఁగనియె.

అయ్య నీ వెవ్వ రి ట్లనుకంప మెరయ, నెయ్యంబుతో మ్రోల నిలిచి వీనులకు
చల్లని నవసుధాసారంబు చిలుకు, మెల్లనిమాటల మేతాపమార
నూరార్పఁబూనితి ... ... నన్ బ్రోవ, ... చాపుడవొ
సిద్ధంబుగా భూప్రసిద్ధుండ నైన, సిద్ధుఁడవో నాకుఁ జెప్పుము తండ్రి
నినుఁ జూచినపుడె పూనిన చెట్ట లెల్లఁ, బొను ... ...

పుడమి … … … … … …, కడలేని యిటువంటికస్తి రాఁదగునె
నరలోకమందార నాతెఱం గెల్లఁ, బరికించి వినుడగ … … … …
ననఘాత్మ రాజరాజను రాజవరుని, తనయుఁడ సారంగధరుఁ డనువాఁడ
పినతల్లియింటికి ప్రేమతో జనిన, వనిత కామారియై వచ్చి తన్గదియు
మనుచు డగ్గన గాదనుచుఁ గప్పించు, కొనివచ్చుటయు నింతి కొఱకొఱతోడ
తనతప్పు నామీఁద దవిలించి చెప్పి, కినుక పుట్టించిన గౌరలి పిసాళి
నన్ను తేఁ డిటులోజమాలి కోయింప, … … … … … …
కరములరవములు కరము సంతాప, కరముల్తై తీపెత్తి కారియం బెనుప
నతితరవ్య … … నిలువ, ధృతి చాలదింక నుద్దీప్తకారుణ్యా
వీక్షణంబె … … … … … …. … … యోగి రాజరాజేంద్ర
కాకున్న … కాయనష్టముగఁ, జేకొని యొకమందు చెప్పవే యనుచు
తనమొండిచేతులు దలమీఁదఁ జేర్చు, కొని నమస్కృతు లొసంగుటయు …
నాఘను … … … … … … … … … … …
హాగురుదేవ … … … … …, భోగి కియ్యాపదల్ బొదవునే యంచుఁ
గటకట నొంది డగ్గరి మేను నిమిరి, పటుమతి నారాచపట్టి నీక్షించి
వత్సనిమదినింక … … … … వత్సలుచార్వ …
చావెందు కోటీరు ఫణిరాజహారు, కైలాసనిలయు శంకరు మహాదేవు
సకలలోకారాధ్యు శరణంబు నొంది, య … … … …
చేకుఱుఁ దొల్లి చేసినపాతకంబుఁ, జేకొని మెసవక చెల్ల దెవ్వరికి
నని యూరడిలఁ బల్కి యాతని నెత్తు, కొని చని కల్వా …
పరిమళమిళిత … … …, పరిపాణసంభ్రమభ్రమరిదభ్రమర
విభ్రమభ్రమరికావిసరనిరంత, రభ్రాజమానవిరావసంకులము
జలజనాళాహ … … , కలనా … …
మధురస్వరోజ్జృంభమాణనినాద, బధిరీకృతాభీలప్రాణిజాలకము
ప్రియవియోగోద్భవాభీలదురంత, భయశోకు … … …
మా … … … ……, దీనవచోవృతదిక్తటంతరము
కేళీసమాసక్తి కిన్నర త్రిదశ, బాలాకుచాలిప్త భద్ర
… ర్దమాంకితదేవ్యగంధస …, నిర్దోషవినిర్మలనీరపూరితము
మకరకచ్ఛపశింశుమారకుళీర, శకులనక్రగ్రాహశాలూరముఖ్య
యాదఃకదంబవిహారసంఘట్ట, నోదితసాంద్రతరోర్మి …
మందగంధానిలమాలికోద్ధూత, సందీప్తశీకరాసారప్రసార
ణాతితపరిషేచితాత్యంతమృదుల, శీతలసముపేతసికతాతలంబు
… నొక్కకొలను డాయఁగ జేరి యందు, దగవానిమేని రక్తంబెల్లఁ గడగి
నీరార్చి కడుపార నీరు ద్రావించి, కూరిమిఁ దానుండుగుహలోను జేర్చి
… … … … … … …, యున్న పా లాకలి యుడుగ ద్రావించి
కరపదసంసిద్ధిఁ గావించుకొఱకు, సొరదిమై మది దలంచుచునుండె నంత
… … … … … … …, రిక్కలు గనుమాసె రేయెండ వాసె
తూరుపు … తొగఱేఁడుబాదె, జారులు వడిబారె జలజము …
శోగ … … … … … .., మొగిఁ దేట్లు కొలఁకుల మ్రోగె నత్తిరిన
ముగురువేల్పులయిక్క మ్రొక్కులఱేడు, పగిలింటిదొర శతబాబాలజోదు
జగముల … … … … .., మగువమేల్ తొగలేమమన్ననబాధ
మిన్నుమానికము ప్రామినుకుల పెట్టె, వెన్నునివలకన్ను వేడివెలుంగు
పుడమివేల్పుల నిచ్చ పూఁజల మెచ్చు, పొడపుగుబ్బలిమీఁద పొడచూపెనంత
… … … … …. … … … … … … … …
… … … … … … … …, నటమటనగుచుఁ గొల్వైయున్న భూమి
తలవరు బొడగాంచి తలవరుల్ దండ, ములు బెట్టి తొడవులు ముందఱఁ బెట్టి
యాకాశ … … … … … …. … … … … …
… … … … … … … …, కొడుకుబోకడ బెట్టుకొంటివటంచు

మిడికిన నతఁడు పబ్బినయార్తితోడ, పుడమి దిగ్గనవ్రాలి పొగ ...
ప్రెగడలఁ జుట్టల పెద్దల బుధులఁ, దగువారిఁ గొనుచు నంతఃపురి కరిగి
యలుకతో బెదరించి యా ...
గ్రన్నన చిత్రాంగి రావించి యోసి, చెనఁటికాన నీచెడుజాడ లుడిగి
కలచంద మెల్ల నిక్కంబుగ ...
వలన నంతయుఁ దలవరు లాలకించి, తెలిసినప్పుడు మాకు తేటతెల్లమిగ
నకట పాతకురాల యాత్మనీ ... ...
పరికింపనేరక పలువనై వంశ, కరుఁడగు కొడుకుఁ బోకడఁబెట్టుకొంటి
నంచు బిట్టదలించియాడిన బిగువు, ...
... ... రవ్వలమారి యారాజున కనియె,
ఓవెఱ్ఱిరాజ నీయొరపుఁబట్టంపు, దేవిమాయ యొకింత తెలియంగ ...
... ... యలుకతో బెద్దలనందఱఁ గూర్చి
ననుదూటఁజేయ డెందమున దలంచి, పనిపూని యదలించి పలికెద వహహ
వినువిను మద్దేవివిరసం ...
... ... చనవున ...
కులగూడకట్టి టక్కులు పన్ని యిట్టు, పలికించెగాక యేపట్టున నిట్టి
... ... డబ్బిన నిటువలె డబ్బంగవలయు
నడవిలో దలవరులందఱు వినఁగ, నడలొంద వాక్రుచ్చె నట యశరీరి
యక్కడ బల్కిన నయ్యభ్రవాణి, ...
ననిపూని పల్కుచో నాకాశవాణి
జను లాలకించి యాశ్చర్యంబు నొందఁ, బలికె నిట్లని మహీపాల యిక్కాళ
తలఁపున నిన్న ... ..., వలనుగా నతఁడు పార్వములకై యిగ్గ
యాళీలోనగరు పిన్నమ్మ యటంచు, జాలనమ్మికతో
, రమణమనోజఘోరవ్యథఁ జిక్కి
బలిమిఁ గైకొనిన నొప్పక యాతఁ డిట్టి, కొల నాకు దవిలింప...
... ...
తనతప్పు వానిపై దవిలించి వాడి, కొనగోళ్ల తనగబ్బిగుబ్బలు వ్రచ్చు
కొని నీకుఁ జెప్పిన గొదుగకపట్టి,
బలికి మిన్నకయున్న పార్థివేశ్వరుఁడు, తలకొనియేడ్చుచు ధరణి మూర్ఛిల్లి
తెలివొంది కన్నులు దెఱచి కట్టెదుఱ,
చెయివేడి నిలుచున్న చిత్రాంగి నలుక, దయినార నీక్షించి తరమి యిట్లనియె.

ఓసి పాతకురాల యోడక యిట్లు,
యామున నుప్పొంగి యకట సద్ధర్మ,
పరుఁడైన కొమురుని బాములఁ బెట్టి, కరచరణంబులు ఖండింపఁజేసి
కులదీపకుండైన కొమరుని మరుని, గెలుచురూపసిని మిగిలిని నిక నిన్ను
జూడనొల్లనటంచు స్రుక్కక దాని,
... ...
ముద్దులకొడుకును నిద్దంపురాణి, నిద్దఱిం బాసి ఈఁ డింకేమి జెప్ప
గొదలేనివంతలఁ గుందుచు సొమ్మ,
బలవరింపుచు విధిం బదరిదూరుచును
బెదరి పల్కుచు డస్సి పెంపెల్లఁ దూలి,
వినయవిద్యాతంత్రి నెరవొప్పఁబలికె
ధరణీశ యీరీతి ధైర్యంబు వదలి,
గడచినపని కింతగాసిఁ బొందుచును, గొడవల నూరకె కుంద నేమిటికి
యింతికై సుతు వధియింపరాదనుచు, యెంత చెప్పినగాని యెఱుగ
చెయ్యంగ గల నది చెప్పుమా తెలియ
పురహరువరమున బొడమినవాఁడు, సరసగుణాఢ్యుఁ డా సారంగధరుఁడు

మహిలోన నీవంటిమంత్రులు గలరె
నీబుద్ధి మును విననేరక బేల, నై బన్న మొందితి నపకీర్తిఁ బడితి
వసుధపై నతఁడు నీవాక్యపద్ధతుల,
మసలక కొని తెచ్చి మందుమంత్రముల, వెస బాగుచేయించి విశ్వవిశ్వంభ
రాతలంబునకెల్ల రాయని గాఁగ,
నని పురోహితబాంధవామాత్యభృత్య,
దగిలి యేతెంచె నాత్మజుఁ డున్నవనికి
యేతెంచి రుధిరసమీపమై భూత,
బాయక తునియలై పడియున్న కరప
దములు వీక్షించి నందనుఁడు లేకున్న, నమితశోకాకులస్వాంతుఁడై నేల
గొడవల నడలుచు కొడుకు బల్ నొప్పి
నెందు దూరెను చూడరే యంచు లేచి, క్రందుగా వనమెల్లఁ గలయద్రిమ్మరు
వంతల పొంతల నల్లినికేత,
సందుల గొందుల జనుచు మహీజ, బృందంబుమాటున నెనసి రోయుచును
కరులార యక్షకిన్నరులార రత్న, ధరులార బిల్ల
శాకరులార పుష్ప, తరులార తోడు మెకములాక చెంచ
తలులార పాపతొయ్యలులార మౌని, కులులార మాద్య
కానరే మాపుత్రు కమనీయగాత్రు
దీనజనాధీను దివిజోపమాను
గనరె మాసుకుమారు ఘనసుకుమారు. కనదమలాకారు కమలాకుమారు
నని విలపించుచు నసురుసురనుచు
గందమారమ్ము మాకందమా యింత
జాలమాగంధ మార్జాలమా నీకు
బదమాకుమారు షట్పదమా యటంచు,
నెడపక తనువున నేరులై పారల
వనరుహరుచిరాస్య వనరుహా యనుచు, దనకు హా యిఁక నెద్ది తనకు హా యనుచు
బెదరుఁ గన్నులు మూయు పెదవులు
దలయూచు బెగ్గిలి దైవంబు దూరు, బలుమారు నఱచేయి ఫాలంబు జేర్చు
హా రాజకులదీప యలఘుప్రతాపు, ధీరసల్లాప.........భువనాతీత
జాతరూపాంబర జాతరూప
నయ్యయో చిత్రాంగియను పెనుసతి, కియ్యెడ నిను బలియిడితిఁబో తండ్రి
యని మడి నింతింత యనరాని వంత,
ధరణిపైఁ బొరలాడు తనముద్దుకొడుకు
కరపదఖండముల్ కరము వేదనల, శిరమున నక్కున జేరుచుకొనుచు
నుడియించుదాక నెమ్మది నూరకుండి
కొదిగి తా మిన్నకయుండిన నేమి,
తడయక నిను మున్ను దరిగించి రాజు,
మఱియు నత్తరి రాజు మాననివెతల, నురియతనంబేది యొరలుచు నుండి
కన్నులు చల్లఁగాఁ గనుఁగొనలేక, పన్నుగా నడవులపాలు గావించి
గడలేని శోకాబ్ధి గడచుట యెట్లు
హాళిమై నిన్ను గయాళియైనట్టి,
సయ్యాన నెందైనఁ జనుమని ప్రోలు
వెలుల గొట్టింపక వేఱఁడి నగుచు,
నీవు లేకున్న యీనిఖిలరాజ్యంబు, జీవనంబును రాచచిన్నె లేమిటికి
నని దుఃఖ మెడలింప నలవిగాకున్న,
బలులోతుమడువున బడఁబోవుచును
నోహోమహీనాథ యోరిమిలేక
డేకొదవయు లేక యెలమి మత్స్యేంద్రు,

గరపదసిద్ధియుఁ గాయసిద్ధియును, దొరకించుకొని యాసురుం డింత
నగరిపునిభుఁడవై నగరి పాలించు
అట మీననాథమహాసిద్ధవరుఁడు, పటుమతి నలరాచపట్టిఁ జేపట్టి
పాలించి యొకమంచెపై నుంచి
హాళినొందుచునుండి యంతట నతని
కరుఁడైన తనసముద్యత్ప్రభావము
సమపేతుఁ గావించి సదమలహృదయు,
మఱియుఁ బెక్కుగ మణీమంత్రౌషధంబు
కూరిమి నరయుచు కొన్నివాసరము
గనుఁగొని వత్స ని న్గాంచినవారి,
మనుజేంద్రుఁ డమ్మహామహునకు నెదురు
సంతోషబాష్పముల్ జలజలదొరుగ
నక్కునఁజేర్చి మేనంతయు నిమిరి,
నక్కట తనయని న్నరమర దలఁచి, టక్కరినై యుక్కడంపఁ జేయుటకు
నాపుణ్యమున మీననా............, ప్రాపయి నిన్ను జేపట్టి రక్షించె
నాతప్పు లెన్నక నాముద్దుకుఱ్ఱ, నీతల్లికై యిందు నిలిచి న న్ననుపు
తనయుని గని నేలఁ దడయక వ్రాలి
గుప్పున దెలివొంది కొమరునిఁ బొదవి, ముప్పిరిగొను మోహమున బొక్కుచున్న
డనుఁగుబిడ్డనికి నెయ్యమున నిట్లనియె
తనయుఁడ నిన్ను వీతనయుఁడ నగుచు, దునిమించినట్టి మత్తుని నన్ను మిగుల
నినుఁ బాసి వర్తింపనేర నీవెంబ
డినె వత్తునంచు నంటినప్రేమ వేడు, కొనుచున్న జనకుఁ గన్గొని
ధీరమని ఖలులు వర్తింతురుగాక
వారె బుద్బుదములవంటి దేహంబు,
ప్రాణి కర్మానురూపంబున నఖిల, యోనులఁ బ్రభవింపుచుండునడం
సారెకు మునింగి వేసారుచు నురక
యీషణత్రయముల నెడపక తగిలి, భీషణాంతశ్శత్రుబృందంబుఁ గూడి
విదితతత్వజ్ఞానవిద్యావిశేష,
సరసలీలావిరాజద్రాజకీర
పోతమాభీలబర్బ్బారభూజాత,
డూర్మిమాలావిహారోజ్జృంభమాణ,
దుత్తూరముల కాసతోఁ జేరుకొనునె
దేవులతోఁ గూడి దివిజేంద్రుఁ బోలి, భూవలయం బెల్లఁ బ్రోచుచునుండు
మని యూరడిలఁబల్కి యాతని సెలవుఁ, గొని మీననాథుతోఁ గూడి యథేచ్ఛ
జనులెల్ల నెలమి రాజ్యం బేలుచుండె
సారంగధరుఁడును జౌరంగి యనెడు, పేరు వహించి సంప్రీతి
బద్ధుఁడై సుఖలీల బచరింపుచుండె
అని యిట్లు శాలివాహనశకాబ్దంబు,
టగు సౌమ్యనామసంవత్సరమున, దగ మాఘబహుళసప్తమియును దివిజ
గురువాసరమునకు గొదలె నీభక్తి,
శంభునిపేర దాక్షాయణీమాన, సాంభోజితరుణమార్తాండునిపేర
శివునిపేర శశాంకశేఖరుపేర,
నకలంకకీర్తివిహారునిపేర, సకలవేదాండపిచండునిపేర
దీనజనావనదీక్షావిధాన, మానితకరుణాసమగ్రునిపేర
పరమాత్ముపేర తాపసజనస్తుత్య, చరితునిపేర విశ్వప్రభుపేర
బుధజనాహ్లాదకాద్భుతమహాపుణ్య,
మహితుఁ డంచితకూచిమంచివంశాబ్ధి,

తనయుండు తిమ్మసత్కవి రచియించి,
… … … … … … … … … … … …

సంపూర్ణము.